# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి:13 సంచిక:258 వరంగల్, 8-7-2026 , బుధవారం పేజీలు: 8 వెల: 1.00


## భార్య బాధ తట్టుకోలేక ఆత్మహత్య

వరంగల్, జూలై 6

వరంగల్ జిల్లా కాజీపేట సమీపంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. భార్యతో వీడియో కాల్ మాట్లాడుకుంటూ, ఆమెకు చూపిస్తూ.. ఎదురుగా వస్తున్న రైలు కింద పడి రాజేశ్ నాయక్ (45) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర ఘటన ఆదివారం రాత్రి జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు రాజేశ్ నాయక్ వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్ గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.అయితే, గత కొంతకాలంగా రాజేష్ భార్యకు, ఆయన తల్లిదండ్రులకు మధ్య ఆస్తి పంపకాల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి మరోసారి భార్యతో గొడవ జరిగింది. రాజేశ్ తీవ్ర మనస్తాపానికి గురై ఇల్లు వదిలి బయటకు వెళ్లిపోయాడు. ఆపై రైలు పట్టాల మీదకు చేరుకుని, భార్యకు నేరుగా వీడియో కాల్ చేశాడు.

## కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల తీరుపై సీఎం తీవ్ర ఆగ్రహం




హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ప్రతి నెల ఒకటో తారీఖునే జీతాలు అందేలా చూడాలని, ఇందుకోసం వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సదరు ఉద్యోగుల వివరాలు, వారి జీతాలు, బ్యాంక్ ఖాతాల సమాచారాన్ని పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేస్తూ 'డిజిటల్ గవర్నెన్స్' దిశగా చట్టాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల తీరుపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేసినప్పటికీ, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసే ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు తేల్చి చెప్పారు.

## ప్రధాని మోడీకి ఇండోనేషియా అత్యున్నత పురస్కారం



రామాయణ కాలం నుంచి భారత్–ఇండోనేసియాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ బంధాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ఇరుదేశాలు కృషి చేస్తున్నాయన్నారు. అక్కడి పార్లమెంటులో మోదీ ప్రసంగిస్తూ.. ఇరుదేశాల మధ్య బలమైన సహకారం ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుకు దోహదపడుతుందన్నారు. ఇండోనేసియా ఎన్నికల వ్యవస్థను ఆధునీకరించడంలో సహాయపడటానికి, ప్రత్యేకమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌ల అభివృద్ధికి భారత్ సాయం చేస్తుందన్నారు. పహల్గాం ఉగ్ర ఘటన సమయంలో భారత్‌కు అండగా ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే, భారత ప్రభుత్వ పథకాలను కాపీ కొట్టామని ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాం అంతకుముందు చెప్పిన విషయాన్ని ప్రస్తావించిన మోదీ.. స్నేహితుల మధ్య 'కాపీరైట్' ఉండవని నవ్వుతూ వ్యాఖ్యానించారు.

మోదీ పథకాలు కాపీ కొట్టా..

జకార్తాలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో అధ్యక్షుడు ప్రబోవో మంగళవారం ఉదయం మాట్లాడుతూ.. ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. ఎన్నో ఏళ్లుగా మోదీని నిశితంగా గమనిస్తున్నానని.. ఆయన చేపట్టిన అనేక కార్యక్రమాలు, పథకాలను కాపీ కొట్టానని అన్నారు. రెండు దేశాల్లో జనాభా ఎక్కువ ఉండడం, ప్రకృతి విపత్తులు వంటి సమస్యల నేపథ్యంలో వాటిని అధిగమించడానికి భారత్ అనుసరించే పద్ధతులను తాము కూడా పాటిస్తామన్నారు. మోదీ చేపట్టే కార్యక్రమాలలో దేనిపైనా కాపీరైట్ ( లేకపోవడం సంతోషంగా ఉందంటూ చిరునవ్వులు చిందించారు.

ఇండోనేసియాలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్!

ప్రధాని మోదీ ఇండోనేసియాలో పర్యటిస్తున్న క్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ( కీలక ప్రకటన చేశారు. ఆ దేశంలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్ ఏర్పాటుకు ప్రధాని మోదీ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.



## అహ్మదాబాద్ బాంబు పేలుళ్ల కేసు.. 38 మందికి ఉరిశిక్ష

అహ్మదాబాద్ దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ఈ ఘోర ఉగ్రవాద దాడికి పాల్పడిన 38 మంది నిందితులకు కింది కోర్టు (ప్రత్యేక న్యాయస్థానం) విధించిన ఉరిశిక్షను హైకోర్టు ధర్మాసనం పూర్తిగా సమర్థిస్తూ ఖరారు చేసింది. అలాగే, మరో 11 మందికి విధించిన యావజ్జీవ కారాగార శిక్షను కోర్టు సమర్థించింది. భారత న్యాయ చరిత్రలోనే ఒకే కేసులో ఇంతపెద్ద సంఖ్యలో (38 మందికి) మరణశిక్షలు ఖరారు కావడం ఇదే ప్రథమం. తీర్పుతో పాటు బాధితులకు ఆర్థిక ఉపశమనం కలిగించేలా హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ పేలుళ్లలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షలు, తీవ్రంగా గాయపడిన బాధితులకు రూ. 5 లక్షలు,సాధారణంగా గాయపడిన వారికి రూ. 1 లక్ష చొప్పున నష్టపరిహారం చెల్లించాలని గుజరాత్ ప్రభుత్వానికి సూచించింది. ఈ నష్టపరిహార ప్రక్రియ మొత్తాన్ని మార్చి 31, 2027 లోగా పూర్తి చేయాలని న్యాయస్థానం గడువు విధించింది.

జులై 26, 2008న గుజరాత్‌లోని ప్రముఖ వాణిజ్య నగరం అహ్మదాబాద్‌లో ఉగ్రవాదులు మారణహోమం సృష్టించారు. కేవలం 70 నిమిషాల స్వల్ప వ్యవధిలోనే ఏకంగా 21 ప్రాంతాల్లో వరుస బాంబు పేలుళ్లతో విరుచుకుపడ్డారు. రద్దీగా ఉండే మార్కెట్లు, బస్సులు మాత్రమే కాకుండా, మొదటి విడత పేలుళ్లలో గాయపడిన క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న సివిల్ హాస్పిటల్‌ను టార్గెట్ చేస్తూ ఉగ్రమూకలు రెండో విడత బాంబులు పేల్చడం గమనార్హం. ఈ అమానవీయ ఘాతుకంలో 56 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోగా, 246 మంది తీవ్రంగా గాయపడ్డారు.

## సింగరేణికి కేంద్రం పూర్తి సహాయ సహకారాలు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి




న్యూఢిల్లీ, జులై 7: దేశాభివృద్ధి విషయంలో సహకార సమాఖ్య విధానంతో అన్ని రాష్ట్రాలు కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు(మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సింగరేణి కోల్ కాలరీస్ లిమిటెడ్ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. 39 వర్కింగ్ మైన్స్‌లో 21 అండర్ గ్రౌండ్ మైన్స్, 18 ఓపెన్ కాస్ట్ మైన్స్ ఉన్నాయని.. సుమారు 6 నుంచి 8 జిల్లాల్లో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయని అన్నారు. లక్షలాది ప్రజల గుండెచప్పుడు సింగరేణి అని వెల్లడించారు.

సింగరేణికి సంబంధించిన మేజర్ మైనింగ్ ప్రాజెక్టుల ఎన్విరాన్మెంటల్, ఫారెస్ట్ క్లియరెన్స్‌లను వేగవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమంలోనూ సింగరేణి కార్మికులు భాగస్వాములయ్యారని తెలిపారు. కార్మికుల ధైర్యాన్ని తెలంగాణ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరన్నారు. ఒడిశాలో నైనీ కోల్ బ్లాక్ సింగరేణికి వచ్చేలా కృషి చేసినట్లు తెలిపారు. సింగరేణి పురోగతికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణతో పాటుగా ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు గనుల వేలంలో పాల్గొనేలా సింగరేణి ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లో సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయన్నారు. 30 నుంచి 35 సంవత్సరాలకు సరిపోయే బొగ్గు ఉందని తెలిపారు. ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం సింగరేణికి లభించిందని.. దీని వల్ల సింగరేణికి సుమారు రూ. 75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉందన్నారు.

~పు 182 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్న ఈ బ్లాక్ ద్వారా.. ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుందన్నారు. దాదాపు 40 నుంచి 50 ఏళ్ల పాటు ఈ గని నుంచి బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని చెప్పుకొచ్చారు. దీని ద్వారా మొత్తంగా రూ. 64,000 కోట్లకు పైగా రెవెన్యూ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. నేరుగా సింగరేణికి ఈ గని ఇవ్వడం ద్వారా ఆక్షన్ ప్రీమియం చెల్లింపు లేని కారణంగా ఆ సంస్థకు కనీసం రూ. 2,550 కోట్లు మిగులుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి రాయల్టీ సహా వివిధ మార్గాల్లో దాదాపు రూ. 16 వేల కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో దారుణం.. భర్తను చంపి పూడ్చిపెట్టిన భార్య

హైదరాబాద్, జులై 7: నగరంలోని మియాపూర్‌లో దారుణం జరిగింది. కట్టుకున్న భర్తను ప్రియుడితో కలిసి భార్య అత్యంత కిరాతంగా హత్య చేసింది. ఆ తరువాత భర్త కనిపించడం లేదంటూ గతేడాది నవంబర్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసిన మియాపూర్ పోలీసులు.. దర్యాప్తు చేపట్టగా అసలు నిజాలు బయటకు వచ్చాయి. ఏడు నెలల తర్వాత ఈ కేసులో భార్యే హంతకురాలిగా పోలీసులు తేల్చారు. భర్తను భార్యే హత్య చేసి ఆపై కనిపించడం లేదంటూ నాటకం ఆడినట్లు పోలీసులు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా భార్య కాల్ రికార్డ్స్‌ను, సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. ఈ క్రమంలో ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు.

భర్తను చంపి మృతదేహాన్ని మహారాష్ట్ర బోర్డర్ వరకు తరలించి పూడ్చిపెట్టినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక పోలీసుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు పెంటేష్(45)గా గుర్తించారు. తన ప్రేమ వ్యవహారానికి భర్త అడ్డుగా ఉన్నాడనే కారణంతో వెంకటేష్‌ను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో భార్య అంగీకరించింది. ప్రస్తుతం నిందితురాలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె ప్రియుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ప్రియుడి కోసం కట్టుకున్న భర్తను భార్య హత్య చేసిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.



## హిమాన్షును పరామర్శించిన కేసీఆర్.

–హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కుమారుడు హిమాన్షుకు జిమ్‌లో వర్కవుట్ చేస్తుండగా సోమవారం సాయంత్రం స్వల్ప గాయమైంది. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ సీఎం కేసీఆర్ ఏఐజీ ఆస్పత్రికి చేరుకుని తన మనవడు హిమాన్షును పరామర్శించారు.

# త్వరలో గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్

భారతీయులకు బంగారంపై ఉన్న మక్కువ, సెంటిమెంట్ ప్రపంచంలో మరెక్కడా కనిపించదు. శుభకార్యం ఏదైనా, పండగ ఏదైనా సెంటిమెంట్‌గా కొనే పసిడి.. కాలక్రమేణా ఇళ్లలోని లాకర్లలోనో, బ్యాంకు బీరువాల్లోనో నిరుపయోగంగా ఉండిపోతుంది. దేశ ఆర్థిక చిత్రం పరంగా చూస్తే, ఈ నిర్ణయం అత్యంత కీలకం కానుంది. భారతదేశం ప్రతి ఏటా వందల టన్నుల బంగారాన్ని విదేశాల నుండి దిగుమతి చేసుకోవడం వల్ల భారీగా విదేశీ మారక ద్రవ్యం బయటకు వెళ్ళిపోతూ కరెంట్ అకౌంట్ డెఫిసిట్ పై ఒత్తిడి పెరుగుతోంది. మన దేశ సరిహద్దుల్లోనే ఇళ్లల్లో ఉన్న 30,000 టన్నుల బంగారంలో కేవలం 5 నుండి 10 శాతం భాగాన్ని చలామణిలోకి తీసుకురాగలిగినా.. రాబోయే ఐదేళ్లలో బంగారం దిగుమతులపై భారం సగానికి పైగా తగ్గుతుంది. ఇది అంతర్జాతీయ మార్కెట్లో భారత రూపాయి విలువను మరింత బలోపేతం చేయడానికి ఎంతో దోహదపడుతుంది. అంతర్జాతీయ మార్కెట్ నివేదికల ప్రకారం.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా భారతీయ కుటుంబాల వద్ద సుమారు 30,000 టన్నుల గృహ వినియోగ బంగారం నిద్రాణంగా ఉంది. అంతర్జాతీయంగా పసిడి ధరలు ఆకాశాన్ని తాకుతున్న ఈ తరుణంలో.. ఈ భారీ సంపదను దేశ ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఒక విప్లవాత్మకమైన సరికొత్త ప్రణాళికను సిద్ధం చేస్తోంది. పెరిగిపోతున్న పసిడి ధరలు దేశ దిగుమతి బిల్లుపై , రూపాయి విలువపై తీవ్ర ప్రభావం చూపుతున్న సమయంలో, పాత గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్ కు కీలక మార్పులు చేస్తూ కేంద్రం ఈ కొత్త సంస్కరణను తీసుకురాబోతోంది. ఈ పునరుద్ధరించిన కొత్త విధానాన్ని రాబోయే ఆగస్టు నాటికి దేశవ్యాప్తంగా అమల్లోకి తెచ్చేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కసరత్తు చేస్తోంది. నిజానికి, గతంలో 2015లోనే నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ గోల్డ్ మానిటైజేషన్ పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ, అది ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోయింది. నాటి నుండి ఇప్పటివరకు దశాబ్ద కాలంలో కేవలం 39 టన్నుల బంగారాన్ని మాత్రమే ప్రభుత్వం ఈ పథకం కింద సేకరించగలిగింది. కఠినమైన బ్యాంకింగ్ నిబంధనలు, బంగారాన్ని కరిగించడానికి కస్టమర్లకు ఉండే సెంటిమెంట్ అడ్డంకులు, ప్యూరిటీ వెరిఫికేషన్ సెంటర్ల కొరత , అవగాహన లోపం దీనికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. అందుకే ఈసారి సాంప్రదాయ బ్యాంకులపైనే కాకుండా, ఏకంగా జువెలర్స్ నే నేరుగా రంగంలోకి దించాలని కేంద్రం డిసైడ్ అయింది. ఈ కొత్త పాలసీలోని అత్యంత కీలకమైన మార్పు ఏంటంటే.. ఇకపై సామాన్య ప్రజలు తమ వద్ద ఉన్న నిరుపయోగ బంగారాన్ని డిపాజిట్ చేయడానికి బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. తాము క్రమం తప్పకుండా వెళ్లే, నమ్మకమైన స్థానిక జువెల వద్దకే నేరుగా వెళ్లవచ్చు. బంగారం వ్యాపారులే నేరుగా కస్టమర్ల నుంచి ఈ పసిడి డిపాజిట్లను సేకరించి, వాటిని ఒకచోట చేర్చే బాధ్యతను తీసుకుంటారు. తరతరాలుగా స్థానిక వ్యాపారులతో భారతీయ కుటుంబాలకు ఉండే సత్సంబంధాలను, నమ్మకాన్ని వాడుకోవడం ద్వారా ఈ స్కీమ్‌ను విజయవంతం చేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. జువెలర్లను కలెక్షన్ అండ్ ప్యూరిటీ టెస్టింగ్ సెంటర్లు గా గుర్తించడం ద్వారా మౌలిక సదుపాయాల కొరతను అధిగమించవచ్చు. ఈ సరికొత్త వ్యూహం వల్ల అటు ప్రభుత్వానికి, ఇటు జువెలర్లకు , సామాన్య వినియోగదారులకు ముగ్గురికీ లాభం చేకూరనుంది . దేశీయంగానే పాత బంగారం రీసైక్లింగ్ ద్వారా అందుబాటులోకి రావడం వల్ల జువెలర్లకు విదేశాల నుంచి కొత్త బంగారాన్ని దిగుమతి చేసుకునే సోర్సింగ్ ఖర్చులు , ప్రీమియంలు భారీగా తగ్గుతాయి. ఫలితంగా దేశీయ మార్కెట్లో బంగారం కొరత తగ్గుతుంది. మరోవైపు, ఇళ్లలో లాకర్లకే పరిమితమై ఎలాంటి ఆదాయాన్ని ఇవ్వని బంగారానికి ప్రభుత్వం బాండ్ల రూపంలో వార్షిక వడ్డీ కల్పిస్తుంది కాబట్టి, సామాన్య ప్రజలకు ఇది ఒక అద్భుతమైన అదనపు ఆదాయ వనరుగా , సురక్షితమైన పెట్టుబడిగా మారుతుంది. డిపాజిట్ గడువు ముగిసిన తర్వాత అంతే బరువు గల స్వచ్ఛమైన బంగారాన్ని లేదా నాటి మార్కెట్ ధర ప్రకారం నగదును పొందే వెసులుబాటు కూడా ఉంటుంది. రాబోయే ఆగస్టులో ప్రారంభం కానున్న ఈ సరికొత్త గోల్డ్ మానిటైజేషన్ పాలసీ పాత లోపాలను అధిగమించి ఏ మేరకు సక్సెస్ అవుతుందనేది ఇప్పుడు వ్యాపార వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. సాంప్రదాయకంగా గోల్డ్ లాకర్ సెంటిమెంట్‌ను, ఆభరణాల రూపాన్ని మార్చడానికి ఇష్టపడని భారతీయ కుటుంబాలు.. ప్రభుత్వం కల్పిస్తున్న లీగల్ గ్యారెంటీని, జువెలర్ల ద్వారా లభించబోయే సులువైన డిపాజిట్ ప్రక్రియను ఏ మేరకు అందిపుచ్చుకుంటాయో వేచి చూడాలి. ఈ పథకం గనుక క్షేత్రస్థాయిలో విజయవంతమైతే.. భారత ఆర్థిక వ్యవస్థకు సరికొత్త 'పసిడి వెలుగులు' రావడం ఖాయమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# మావిగన్ పై కేడర్ లో సందిగ్ధత

కర్నూలు జూలై 7,

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో రాజధాని అంశం మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. ఐదేళ్ల పాటు మూడు రాజధానుల నినాదంతో గందరగోళానికి తెరలేపిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. తాజాగా జూలై 2026 లో సరికొత్తగా మావిగన్ మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు కోస్తా అర్బన్ కారిడార్ అజెండాను తెరపైకి తెచ్చారు. వచ్చే ఎన్నికల్లో మావిగన్ వర్సెస్ అమరావతి అనేదే తమ పార్టీ ప్రధాన ఎన్నికల ఎజెండా అని, దీనిని మేనిఫెస్టోలో కూడా పెడతామని జగన్ స్వయంగా ప్రకటించారు. అయితే, ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. అధినేత ఇంత పెద్ద పొలిటికల్ బాంబు పేల్చినా, అనుబంధ మీడియా, సోషల్ మీడియా వింగ్ , పార్టీ సీనియర్ నేతలు దీనికి పెద్దగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. సజ్జల రామకృష్ణారెడ్డి లాంటి ఒకరిద్దరు మినహా మిగిలిన నేతలెవరూ ఈ టాపిక్‌ను ఓ రేంజ్‌లో జనాల్లోకి తీసుకెళ్లడానికి ఉత్సాహం చూపించడం లేదు. మొదటి ప్రధాన కారణం.. ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో తీవ్ర నష్టం జరుగుతుందనే భయం. గతంలో జగన్ మూడు రాజధానుల నినాదం ఎత్తుకున్నప్పుడు విశాఖపట్నానికి ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్, కర్నూలుకు జ్యుడీషియల్ క్యాపిటల్ అన్నారు. దీనివల్ల ఆయా ప్రాంతాల్లోని నేతలు, కేడర్ మా ప్రాంతానికి రాజధాని వస్తోంది అని గర్వంగా ప్రచారం చేసుకున్నారు. కానీ ఇప్పుడు జగన్ ప్రతిపాదిస్తున్న మావిగన్ పూర్తిగా కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలోకి వస్తుంది. ఇప్పుడు గనుక వైసీపీ సోషల్ మీడియా దీనిని విపరీతంగా ప్రమోట్ చేస్తే.. మరి విశాఖ, కర్నూలు పరిస్థితి ఏంటి? ఉత్తరాంధ్ర, రాయలసీమలను జగన్ వదిలేశారా?" అని కూటమి శ్రేణులు కౌంటర్ అటాక్ చేయడం ఖాయం. ఈ రీజినల్ సెంటిమెంట్ దెబ్బతింటుందనే భయంతోనే ఆయా జిల్లాల వైసీపీ నేతలు ఈ టాపిక్‌ను ముట్టుకోవడానికే భయపడుతున్నారు. ఇటీవల కేంద్ర పార్లమెంట్ 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ చట్టం ద్వారా అమరావతిని ఏకైక రాజధానిగా అధికారికంగా గెజెట్‌లో పొందుపరిచింది. ఇలాంటి పరిస్థితుల్లో చట్ట విరుద్ధంగా మళ్లీ కొత్త కారిడార్ల పేరుతో రాజధానిని మారుస్తామనే భ్రమలు కల్పిస్తే.. న్యాయపరంగా పార్టీ మళ్లీ డిఫెన్స్‌లో పడుతుందని వైసీపీ అంతర్గత వర్గాలు భావిస్తున్నాయి. ఒకవైపు అమరావతిలో ప్రపంచ బ్యాంకు నిధులతో పనులు పరుగులు పెడుతుంటే, సామాన్య ఓటర్లు కూడా మళ్లీ రాజధాని మార్పుల గందరగోళాన్ని కోరుకోవడం లేదు. అందుకే, సోషల్ మీడియాలో ఈ టాపిక్‌ను ఎక్కువగా కెలికితే.. నెటిజన్ల నుండి పాజిటివ్ రెస్పాన్స్ కంటే నెగటివ్ ట్రోలింగ్ ఎక్కువ వచ్చే ప్రమాదం ఉందని ఐటీ సెల్ వ్యూహాత్మకంగా సైలెంట్ అయిపోయింది. అధికార కూటమి ఈ ప్రతిపాదనను తిప్పికొడుతున్న తీరు కూడా వైసీపీని ఆత్మరక్షణలో పడేసింది. మంత్రి లోకేష్, అచ్చెన్నాయుడు వంటి నేతలు జగన్ మూడు రాజధానులు డెవలప్ చేసింది నిజమే.. కానీ అవి హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలు అంటూ ఘాటుగా కౌంటర్లు ఇస్తున్నారు. జగన్ మాట మార్చే నైజాన్ని ఎండగడుతూ.. 2014లో అమరావతికి జై కొట్టారు, 2019లో మూడు రాజధానులు అన్నారు, ఇప్పుడు 2026లో మావిగన్ అంటున్నారు.. అసలు జగన్‌కు ఒక స్థిరమైన ఆలోచన ఉందా అని టీడీపీ సోషల్ మీడియా వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక వైకాపా కేడర్ నీళ్లు నములుతోంది. జగన్ మోహన్ రెడ్డి 'మావిగన్' అనే కొత్త అజెండాను ప్రకటించింది కేవలం అమరావతిలో జరుగుతున్న భారీ అభివృద్ధి, పెట్టుబడుల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి మాత్రమేనని క్షేత్రస్థాయి నేతలు భావిస్తున్నారు. పైగా, వచ్చే ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉండటంతో.. అప్పుడే ఈ నినాదాన్ని జనంలోకి తీసుకెళ్లి 'క్యాపిటల్ సెంటిమెంట్'ను పాడుచేసుకోవడం కంటే, ప్రస్తుతానికి హోల్డ్‌లో పెట్టడమే మంచిదనే అంతర్గత వ్యూహంతోనే వైసీపీ మీడియా, సోషల్ మీడియా దీనిని పెద్దగా పట్టించుకోనట్లు నటిస్తున్నాయి. ఒక రకంగా చెప్పాలంటే, అధినేత విసిరిన 'మావిగన్' బాణం.. సొంత పార్టీలోనే పట్టు కోల్పోయి, కేవలం తాడేపల్లి ప్రెస్ మీట్లకే పరిమితమైపోయిందని పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు.

# పవన్‌తో ఆశా ఆశలు

విజయవాడ జూలై 7,

ఏపీ రాజకీయాల్లో వంగవీటి కుటుంబానికి ప్రత్యేక స్థానం. 1988లో వంగవీటి మోహన్ రంగ చనిపోయారు. ఇప్పటికీ ఆయన పేరు రాజకీయాల్లో వినిపిస్తూనే ఉంటుంది. కాపుల ఆశాజ్యోతి గా రంగాను అభివర్ణిస్తారు. కానీ ఉమ్మడి రాష్ట్రంలో విజయవాడ వేదికగా అన్ని వర్గాల ప్రజల కోసం పనిచేశారు. అయితే ఆయన మరణానికి సంబంధించి నిందితులను గుర్తించలేకపోయాయి ప్రభుత్వాలు. కానీ రాజకీయంగా కాపుల కోసం ఆయన పేరును ప్రతి ఎన్నికల్లోను వినియోగిస్తుంటారు. తాజాగా ఆయన జయంతి జరగగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నివాళులు అర్పించారు. దీనిపై రంగ కుమార్తె ఆశా కిరణ్ స్పందించారు. పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు చెబుతూనే త్వరలో ఆయనను కలుస్తానని చెప్పుకొచ్చారు. కొద్దిరోజుల కిందట ఏపీలో రంగారాధ మిత్రమండలి పూర్వ వైభవం కోసం ఆశాకిరణ్ ఎంట్రీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు కూడా చేశారు. త్వరలో పొలిటికల్ ఎంట్రీ ఉంటుందన్న ప్రచారం కూడా జరిగింది. అయితే ఇప్పుడు తాజాగా ఆమె జనసేనలో చేరుతారని పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభం అయింది. దానికి కారణం లేకపోలేదు. రంగా జయంతి నాడు పవన్ కళ్యాణ్ ప్రత్యేకంగా నివాళులు అర్పించేసరికి కృతజ్ఞతలు చెప్పారు. త్వరలో పవన్ కళ్యాణ్ ను కలిసి రంగా ఆశయాలకు సంబంధించి కొన్ని అంశాలను చర్చిస్తానని చెప్పుకొచ్చారు. ప్రధానంగా కృష్ణాజిల్లాకు వంగవీటి మోహన్ రంగ పేరు, రంగా పుష్కర్ ఘాట్ ఏర్పాటు వంటి వాటిపై చర్చించేందుకు త్వరలో ఆమె పవన్ కళ్యాణ్ ను కలవనున్నట్లు తెలుస్తోంది. అయితే ఆమె జనసేనలో చేరిక కోసమే ఈ ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. వంగవీటి మోహన్ రంగా మరణం అనంతరం ఆయన రాజకీయ వారసుడిగా కుమారుడు రాధాకృష్ణ పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. 2004లో కాంగ్రెస్ పార్టీ ద్వారా అసెంబ్లీకి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తరువాత ప్రజారాజ్యం పార్టీలో చేరారు. అక్కడ నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి.. ఆ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా పని చేశారు.




జగన్మోహన్ రెడ్డితో విభేదించి తెలుగుదేశం పార్టీలో చేరారు. ప్రస్తుతం ఆ పార్టీలోనే కొనసాగుతున్నారు. త్వరలో ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఖాయమన్న ప్రచారం నడుస్తోంది. ఇంతలోనే ఆశాకిరణ్ జనసేనలో చేరుతారని తెలుస్తోంది. ప్రస్తుతం కాపుల చుట్టూ వైసిపి రాజకీయం చేస్తోంది. అందుకే టిడిపిలో రాధాకృష్ణకు.. జనసేనలో ఆశా కిరణ్ కు ప్రాధాన్యం కల్పించడం ద్వారా చెక్ చెప్పాలన్నది చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఆలోచనగా తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# ఉమాకు ఈ సారైనా...

విజయవాడ, జూలై 7,

గవర్నర్ కోటాలో ఖాళీ కానున్న రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీ ప్రక్రియ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆసక్తి రేపుతుండగా, ఈసారి అయినా మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమామహేశ్వరరావుకు అవకాశం దక్కుతుందా అనే చర్చ జోరందుకుంది. గత ఎన్నికల్లో కూటమి సమీకరణాల కారణంగా మైలవరం అసెంబ్లీ సీటును వసంత కృష్ణప్రసాద్ కోసం త్యాగం చేసిన ఉమా.. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సరైన గుర్తింపు



కోసం వేచి చూస్తున్నారు. కష్టకాలంలో పార్టీని నమ్ముకుని ఉన్న సీనియర్లకు చంద్రబాబు ఈసారి న్యాయం చేస్తారనే నమ్మకంతో ఉమా అనుచరులు ఈ గవర్నర్ కోటా రేసుపై భారీ ఆశలు పెట్టుకున్నారు. అయితే, ఈ స్థానాల భర్తీ విషయంలో చంద్రబాబు నాయుడు ముందు అనేక సమీకరణాలు ఉన్నాయి. ఇప్పటికే ఒక స్థానానికి సీనియర్ నేత వర్ల రామయ్య పేరు బలంగా వినబడుతుండగా.. మిగిలిన ఏకైక స్థానం కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. పిఠాపురం సీటును పవన్ కళ్యాణ్ కోసం వదులుకున్న ఎస్.వి.ఎస్.ఎన్. వర్మతో పాటు వంగవీటి రాధా, మహాసేన రాజేష్ వంటి నేతలు కూడా అధిష్టానం నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. రెండు స్థానాలు మాత్రమే ఖాళీగా ఉండటం వల్ల, సామాజిక మరియు ప్రాంతీయ సమతుల్యతను (ముఖ్యంగా రాయలసీమ లేదా బీసీ నేతలకు ప్రాధాన్యత) దృష్టిలో ఉంచుకుంటే ఉమాకు ఈసారి కూడా నిరాశే ఎదురవుతుందా అనే సందేహాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి దేవినేని ఉమా పేరును చంద్రబాబు పరిశీలిస్తారా, లేదా భవిష్యత్తులో రాబోయే ఇతర కోటా.. స్థానిక సంస్థలు లేదా అసెంబ్లీ ఎమ్మెల్సీ స్థానాల్లో సర్దుబాటు చేస్తారా అనేది సస్పెన్స్‌గా మారింది. పార్టీ కోసం ఏళ్ల తరబడి శ్రమించిన ఉమాకు ఈసారి పెద్దల సభలో అవకాశం కల్పిస్తే కృష్ణా జిల్లా క్యాడర్‌లో కొత్త ఉత్సాహం వస్తుందని ఆయన వర్గం భావిస్తోంది. మరికొద్ది రోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ రెండు స్థానాలపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

==============================

# వైసీపీలో చీలిక ప్రకంపనలు

విజయవాడ, జూలై 7,

ఏపీలో ప్రతిపక్షంగా ఉన్న వైసీపీలో చీలిక రానుందా? ఆ పార్టీ నాయకులు చీలిపోవడమో.. లేక కూటమిలోని ఓ పార్టీలో చేరిపోవడమో ఖాయంగా కనిపిస్తోందా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. నాయకుల మాటకు విలువ లేకపోవడం.. వారు చెప్పింది ఆలకించే స్థాయిలో జగన్ ఇంకా కనిపించక పోవడం.. వంటివి పెద్ద ఎత్తున చర్చకు వస్తున్నాయి. దీంతో ఇప్పుడు సీనియర్ల నుంచి జూనియర్ల వరకు తమకు అనుకూలంగా ఉన్న పార్టీలవైపు దృష్టి పెడుతున్నట్టు తెలుస్తోంది. ఇదే జరిగితే.. వైసీపీ చీలిక దిశగా అడుగులు వేయడం ఖాయమని అంటున్నారు. వాస్తవానికి పార్టీల్లో భిన్నాభిప్రాయాలు ఉండడం సహజమే. కానీ, కీలకమైన ప్రజల కోణంలో చూసినప్పుడు.. నాయకుల వాదనను కూడా పార్టీలు పట్టించుకోవాలి. ఉదాహరణకు.. పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీని వెనుకేసుకు వచ్చారు. ఇలా వద్దని పార్టీ నాయకులు కోరారు. ఆమె వినిపించుకోలేదు. ఫలితంగా పార్టీ ఓడిపోవడమే కాదు.. ఇప్పుడు పార్టీ నేతలు కూడా.. ఆమెను వదిలేసి వెళ్లిపోతున్నారు. ఇక, పార్టీనే మూసేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా తమిళనాడులో అన్నాడీఎంకే.. బీజేపీతో పొత్తు పెట్టుకోవడాన్ని ఆ పార్టీ నాయకులు సహించలేదు. కానీ, నాయకుల మాటను పళని స్వామి వినిపించుకోలేదు. ఫలితంగా గెలిచే పార్టీ కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేక పోయింది. ఇలా.. నాయకుల మాట వినిపించుకోని పార్టీలు దేశంలో చీలిపోతున్నాయి. చిందరవందరగా కూడా మారుతున్నాయి. ఈ నేపథ్యంలోనే వైసీపీలోనూ చీలిక దిశగా అడుగులు పడుతున్నాయన్న చర్చ జరుగుతోంది.

గతంలో మూడు రాజధానులు సహా.. ప్రస్తుత మావిగన్ ప్రతిపాదన వంటివి వైసీపీ నాయకులు జీర్ణించుకో లేకపోతున్నారు. ఎన్నికల సమయంలో ఎవరికి టికెట్ ఇస్తారో.. ఎవరిని మారుస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అలానే.. తమకు ఏమాత్రం వాల్యూ లేకుండా చేస్తున్నారని సీనియర్లు వాపోతున్నారు. ఈ పరిణామాల క్రమంలోనే నాయకులు పక్క చూపులు చూస్తున్నారు. ఇక, కూటమి పార్టీల్లో బలోతపేతం కావాలని భావిస్తున్న.. బీజేపీ వీరిని చేర్చుకునేందుకు రెడీగా ఉన్నట్టు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇలాంటి సమయం కోసం.. బీజేపీ ఎదురు చూస్తున్న పరిస్థితి దేశవ్యాప్తంగా కూడా కనిపిస్తోంది. ఈ క్రమంలో వైసీపీ నుంచి వచ్చేవారికి బీజేపీ ఎర్రతివాచీ పరిచినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. ఇక, వ్యక్తిగతంగా నాయకులకు ఎలానూ బలం ఉంటుంది. సో.. అలాంటి వారు ఇక, జగన్‌పై తిరుగుబాటు చేయడం ఖాయమన్న సంకేతాలు వస్తున్నాయి. వచ్చే వారం పదిరోజుల్లో ఏదైనా జరగొచ్చని.. వైసీపీకి చెందిన నాయకుడు ఒకరు నర్మగర్భ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# ఈ సారి డిఫరెంట్ గా చంద్రబాబు

తిరుపతి, జూలై 7

సీఎం చంద్రబాబు ప్రజలకు మరింత చేరువయ్యేలా వ్యవహరిస్తున్నారు. ఎవరో రావాలి.. ఏదో చెప్పాలి.. అని ఎదురు చూడకుండా.. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు తానే స్వయంగా రంగంలోకి దిగుతున్నారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన ఆయన.. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఇంపార్టెన్స్ ఇస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా తనసొంత నియోజకవర్గం కుప్పంలో ప్రజలను నేరుగా కలుసుకున్నారు. వారి నుంచి అర్జీలు తీసుకున్నారు. మూడు రోజుల పర్యటన నిమిత్తం కుప్పం వచ్చిన చంద్రబాబు శనివారం నేరుగా ప్రజలతో మమేకమయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా సీఎంతో భేటీ అయ్యేందుకు వచ్చారు. అయితే.. వారిని హాల్‌లోనే కూర్చోబెట్టిన సీఎం.. అప్పటికే బయట వేచి ఉన్న ప్రజలను కలుసుకున్నారు. వారిని ఆప్యాయంగా పలకరించారు. సమస్యలు తెలుసుకున్నారు. అలానే.. స్వర్ణ కుప్పం ప్రాంత అభివృద్ధిని వారికి వివరించారు. ప్రతి ఇంటికీ సోలార్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలను చెప్పారు. విద్యుత్ వినియోగంలో సౌర విద్యుత్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. ఇక, వ్యక్తిగత సమస్యలను కూడా తెలుసుకున్న చంద్రబాబు పలువురికి అక్కడికక్కడ ఆర్థిక సాయం ప్రకటించారు. కొందరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులు అందించారు. ఇక, కుప్పం నియోజకవర్గంలోని గ్రామాల పరిధిలో అవలంభిస్తున్న నెట్ జీరో(వ్యర్థాల రహిత) వ్యవస్థను అడిగి తెలుసుకున్నారు. పలు ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ వ్యవస్థ గురించి తెలుసుకున్నారు. అలానే విద్యుత్ వినియోగంతో నడిచే ఇండక్షన్ కుక్కర్లు, టెర్రస్ గార్డెనింగ్ వంటి వివరాలను పలువురు చంద్రబాబుకు చెప్పారు. మారుతున్న రాజకీయ వాతావరణం.. ప్రజల అభిరుచులకు అనుగుణంగా చంద్రబాబు తనను తాను మార్పు చేసు కుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా తన సొంత నియోజకవర్గంలో గతానికి భిన్నంగా ఆయన ఈ ఏడాది పలుమార్లు పర్యటించారు. ప్రతి ఒక్కరికీ చేరువ అవుతున్నారు. తద్వారా వైసీపీ వ్యూహాత్మక రాజకీయాలకు పరోక్షంగా చంద్రబాబు చెక్ పెడుతున్నారన్న వాదన వినిపిస్తోంది.

===================

# విశాఖలో ట్రైయాంగిల్ పాలిటిక్స్..

విశాఖపట్టణం, జూలై 7

విశాఖ జిల్లాలో మంత్రి పదవిని ఆశిస్తున్న వారిలో సీరియస్ గా రేసులో ఉన్న వారిగా ఈ ముగ్గురు నేతల పేర్లను ప్రచారం చేస్తున్నారు. మంత్రి వర్గ విస్తరణ ఈ శ్రావణ మాసం ఉండవచ్చు అని అంటున్నారు. దాంతో ఆగస్టు నెల అంటే దగ్గరలో ఉంది కాబట్టి మంత్రి పదవుల మీద ఆశపడుతున్న వారిలో వారి వర్గీయులలో చురుకుదనం పుడుతోంది అని అంటున్నారు. ఇక విశాఖ జిల్లాకు 2024లో మంత్రి పదవి దక్కలేదు అన్నది తెలిసిందే. ఆ మాటకు వస్తే వైసీపీ కూడా 2022 తరువాత జరిపిన విస్తరణలో విశాఖ జిల్లా భీమిలీకి చెందిన అవంతి శ్రీనివాస్ ని మంత్రి పదవి నుంచి తప్పించేసి అనకాపల్లికి చెందిన గుడివాడ అమర్నాథ్ కి ఇచ్చింది. అంతే కాదు మాడుగులకు చెందిన బూడి ముత్యాలనాయుడుకు కూడా ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చింది. అలా విశాఖ జిల్లాకు గడచిన నాలుగేళ్లగా మంత్రి పదవి అన్నది లేకుండా పోయింది అని అంటున్నారుమరో మూడేళ్ళలో ఏపీలో సార్వత్రిక ఎన్నికలు ఉన్నాయి. దాంతో ఎన్నికల నాటికి విశాఖ జిల్లాను ముందంజలో నడిపించాల్సి ఉంది. అంతే కాదు అనేక కంపెనీల్ విశాఖ జిల్లాకు తరలి వస్తున్నాయి. వాటిని కో ఆర్డినేట్ చేసుకోవాల్సి ఉంది. ఇక రాజకీయ పరంగా చూసినా కూడా విశాఖ జిల్లా కీలకంగా మారుతోంది. జీవీఎంసీ ఏపీలోనే అత్యధిక వార్డులతో పెద్దదిగా మారబోతోంది. దానికి ఎన్నికలు కూడా జరగబోతున్నాయి. కూటమిని మళ్ళీ గెలిపించాలి అంటే విశాఖకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే అన్నది కూడా పెద్దగా వినిపిస్తోంది. దీంతో ఈసారి విశాఖ నుంచి మంత్రిని చూడబోతున్నారు అని అంటున్నారు. టీడీపీ ప్రభుత్వంలో విశాఖ నుంచి గంటా శ్రీనివాసరావు మంత్రిగా అయిదేళ్ల పాటు పనిచేశారు. జిల్లాలో పార్టీని అంతా కట్టుగా ఉంచారు, అన్ని విధాలుగా అండగా ఉన్నారు. ఆయన అనుభవం గట్టిగా చేసే రాజకీయం వ్యూహాత్మక వైఖరి అన్నీ చూసుకుంటే కూటమిలోని మూడు పార్టీల మధ్య కో ఆర్డినేషన్ తీసుకుని రావడమే కాకుండా జిల్లాలో అభివృద్ధికి కూడా కృషి చేస్తారు అని అంటున్నారు. ఆయన భీమిలీ నియోజకవర్గంలోనే ఎక్కువ కంపెనీలు వచ్చాయి. వాటి భూసేకరణ విషయంలో గంటా ఎక్కువగా చొరవ తీసుకుని భూసేకరణ సాఫీగా సాగేలా చూశారు. దాంతో ఆయన పేరు అయితే మంత్రి పదవి విషయంలో మారుమోగుతోంది అని అంటున్నారు. ఆయనకు ఇస్తేనే వైసీపీని కూడా గట్టిగా కట్టడి చేయగలరు అన్న అంచనాల మధ్య గంటా కాబోయే మంత్రి అని ఊహాగానాలు అయితే వినిపిస్తున్నాయి. ఇక ఏపీ టీడీపీ ప్రెసిడెంట్ గా ఉన్న పల్లా శ్రీనివాసరావు సైతం లైన్ లో ఉన్నారని అంటున్నారు. ఆయన పట్ల టీడీపీ అధినాయకత్వం సుముఖంగా ఉందని చెబుతున్నారు. వివాదాలు లేని తీరు అందరినీ కలుపుకుని పోయే విధానం అన్నీ కూడా ఆయనకు మంత్రి పదవి కట్టబెడితే కలసి వస్తుందని అంటున్నారు. ఇక బలమైన యాదవ సామాజిక వర్గం విశాఖ సిటీలో ఎక్కువగా ఉన్నారు, వారికి ఇప్పటిదాకా మంత్రి పదవి ఈ ప్రాంతంలో దక్కలేదు, దాంతో పల్లాకు ఈ పదవిని ఇవ్వడం ద్వారా ఆ బలమైన వర్గం మద్దతుని నూరు శాతం అందుకోవాలన్న వ్యూహం కూడా ఉందని అంటున్నారు. ఇలా అనేక లెక్కలు అనుకూలంగా ఉండడంతో పల్లా కి మంత్రి పదవి ఇస్తారు అని అంటున్నారు. దీని మీద కూడా ఊహాగానాలు బాగా వ్యాపిస్తున్నాయిమరో విశేషం ఏంటి అంటే బీజేపీ కూడా అనూహ్యంగా రేసులోకి రావడం. బీజేపీకి రెండు మంత్రి పదవులు ఇస్తారని ప్రచారంలో ఉంది. ఏపీలో బీజేపీ గెలిచింది ఎనిమిది ఎమ్మెల్యే సీట్లు, రాయలసీమ నుంచి సత్యకుమార్ యాదవ్ కి బెర్త్ తొలి విడతలోనె ఇచ్చారు. ఇక విస్తరణలో కనుక రెండవ మంత్రి పదవి ఇస్తారు అని కచ్చితంగా వినిపిస్తున్న మాట. దాంతో. కోస్తాలో బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నా అక్కడ మంత్రులు అనేక మంది ఉన్నారు. పైగా సామాజిక ప్రాంతీయ సమీకరణలు అన్నీ చూసుకుంటే ఉత్తరాంధ్రకే ఎక్కువ చాన్స్ ఉందని అంటున్నారు. విశాఖ ఉత్తరం నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో ఆ పార్టీ సభా పక్ష నాయకుడిగా ఉన్న విష్ణు కుమార్ రాజుకు మంత్రి పదవి దక్కుతుందని ఊహాగానాలు అయితే వినిపిస్తున్నాయి. మంత్రి వర్గంలో క్షత్రియులకు చోటు లేదు కాబట్టి ఆ కోణంలో నుంచి చూసినా రాజు గారికి చాన్స్ ఉండొచ్చు అన్నది ఒక అంచనా. మొత్తానికి మిగిలిన వారు ఎంతో మంది ఆశపడుతున్నా ఈ ముగ్గురు పేర్లు విశాఖ జిల్లా నుంచి వినిపిస్తున్నాయి.

# రావణ్ లింక్ ప్రకాష్ కి చుట్టుకుంటోందా...

ఏలూరు, జూలై 7,




గత రెండు మూడు రోజుల నుండి ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ తన సోషల్ మీడియా అకౌంట్స్ ద్వారా ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై ఏ రేంజ్ లో విరుచుకుపడుతున్నారో మన కళ్లారా చూస్తూనే ఉన్నాం. మాత విద్వేషాలను రెచ్చగొట్టే 'ప్రశ్న రావణ్' ని అరెస్ట్ చేస్తే , ప్రకాష్ రాజ్ కి ప్రాణం పోయినంత పని అయ్యింది. అతని కోసం రోజుకి రెండు మూడు వీడియోలు అప్లోడ్ చేస్తూ 'జనం చూస్తున్నారు' అంటూ ఆయన మాట్లాడుతున్న మాటలపై సోషల్ మీడియా లో నెటిజెన్స్ తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. తీవ్రవాదులను ప్రోత్సహిస్తూ , హిందూ దేవుళ్లపై దుర్భాషలాడుతూ , ఇష్టమొచ్చినట్టు మాట్లాడే రావణ్ కోసం ప్రకాష్ రాజ్ ఇంతలా పోరాడడం సిగ్గు చేటు అంటూ మండిపడుతున్నారు. ఇక నేడు ప్రకాష్ రాజ్ అప్లోడ్ చేసిన వీడియో అయితే జనాల్లో అనేక అనుమానాలకు భీజం పోసింది.ప్రకాష్ రాజ్ మాట్లాడుతూ 'ఇప్పుడు పోలీసులు రావణ్ మొబైల్ ని తీసుకొని , అతని వద్ద ఉన్నటువంటి సమాచారం మొత్తాన్ని సేకరిస్తారు. అతనికి మద్దతుగా నిలబడిన ప్రతీ ఒక్కరిని ఇబ్బందులకు గురి చేస్తారు, ఇదే కదా జరిగేది' అంటూ ఒక సంచలన వ్యాఖ్య చేశారు. ఇది విన్న తర్వాత ఇన్ని రోజులు ప్రకాష్ రాజ్ బాధపడింది రావణ్ ని అరెస్ట్ చేసినందుకు కాదు , అతనితో ఈయన నడిపిన గూడూపుఠాణి మొత్తం బయటపడుతుంది అనే భయం తోనే ప్రకాష్ రాజ్ ఇంతలా ఆరాటపడుతున్నారు , వణికిపోతున్నారు అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ అంటున్నారు. రావణ్ , ప్రకాష్ రాజ్ లను నడిపిస్తున్న నెట్ వర్క్ మొత్తం ఈ రిమాండ్ రిపోర్ట్ లో బాటపడబోతుందని, ఇక వీళ్ళ ఆట ముగిసిపోయింది అంటూ సోషల్ మీడియా లో విశ్లేషకులు అంటున్నారు. ఇదంతా పక్కన పెడితే , ప్రకాష్ రాజ్ కి తమిళనాడు డీఎంకే పార్టీ తో ఎంత మంచి సాన్నిహిత్యం ఉందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు.వాళ్లకు మద్దతుగా, ఆ పార్టీ నాయకులతో , ఎమ్మెల్యేలతో మంత్రులతో కలిసి ఎన్నో ప్రెస్ మీట్ లు కూడా ఇచ్చారు. ఒక ప్రెస్ మీట్ లో అయితే పత్తి ఎమ్మెల్యే తో ప్రకాష్ రాజ్ మాట్లాడుతూ 'బాగా మాట్లాడానా ?, ఇంకా ఏమేమి మాట్లాడాలి' అని అడగడం , అందుకు సదరు నేత సూచనలు ఇవ్వడం వంటివి మన కళ్లారా చూశాము . అలాంటి పార్టీ కి చెందిన ఎమ్మెల్యే ని తమిళనాడు సీఎం విజయ్ అరెస్ట్ చేయిస్తే ప్రకాష్ రాజ్ ఇప్పటి వరకు నోరు మెదపలేదు. తన సన్నిహిత పార్టీ ఎమ్మెల్యే అరెస్ట్ అయితే ఇప్పటి వరకు స్పందించని ప్రకాష్ రాజ్ , ఒక సాధారణ యూట్యూబర్ అరెస్ట్ అయితే , ఎందుకు ఇంతలా ఉలిక్కిపడుతున్నారు?, కచ్చితంగా వీళ్లిద్దరి మధ్య ఏదో జరిగింది అంటూ సోషల్ మీడియాలో నెటిజెన్స్ అనుమానిస్తున్నారు.

# టీఆర్పీలపై కేంద్రం నిషేధం...

హైదరాబాద్, జూలై 7,

టీవీ చానెల్స్ కి కేంద్ర ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది. టీవీ చానెల్స్ ఆదాయానికి కొలమానం గా నిలిచే ఒకీఖ రేటింగ్స్ పై నిషేధం విధిస్తు కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ రేటింగ్స్ ఆధారంగానే టీవీ చానెల్స్ కి కమర్షియల్ యాడ్స్ వస్తుంటాయి. రేటింగ్స్ ని బట్టే టీవీ చానెల్స్ యాజమాన్యాలు భారీ రేంజ్ యాడ్స్




ద్వారా డబ్బులు సంపాదిస్తూ ఉంటారు. ఇకపై అలాంటి అవకాశాలు తగ్గిపోనున్నాయి. దేశం లోని అన్ని రకాల టీవీ చానెల్స్ ర్యాంకింగ్స్ , రేటింగ్స్ ని నిలిపివేస్తూ కేంద్ర సమాచార, ప్రసారాల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. గతం లో ఈ టీఆర్పీ రేటింగ్స్ వ్యవహారం లో తీవ్రమైన వివాదాలు తలెత్తాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం న్యూస్ చానెల్స్ రేటింగ్స్ ని నిలిపివేసింది.ఇప్పుడు లేటెస్ట్ గా జనరల్ ఎంటర్టైన్మెంట్ , సినిమా , స్పోర్ట్స్ సహా అన్ని రకాల ఎంటర్టైన్మెంట్ చానెల్స్ కి కూడా రేటింగ్స్ ని నిలిపివేసింది. ఈ కఠిన నిర్ణయం వెనుక కారణాలు ఉన్నాయి. కొన్ని ఛానళ్ళు అనుచిత , అక్రమ పద్ధతులు అనుసరించడమే అందుకు ప్రధాన కారణం. బ్రాడ్కాస్ట్ ఆడియన్స్ రీసెర్చ్ కౌన్సిల్ లెక్కిస్తున్న ప్రస్తుత బార్-ఓ-మీటర్ల వ్యవస్థను కొన్ని పెద్ద నెట్ వర్కులు మేనేజ్ చేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. తప్పుడు పద్ధతుల్లో రేటింగ్స్ ని పెంచుకొని ప్రకటనదారులు మోసం చేస్తున్నాయనే ఆరోపణలు ఈమధ్య కాలం లో ఎక్కువగా వెల్లువెత్తాయి. కేవలం రేటింగ్స్ రేసులో ముందంజలో ఉండడం కోసం ఛానళ్ళు కంటెంట్ లోని నాణ్యత ని దిగజారుస్తున్నారని , అది సమాజం పై తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపుతోందని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది.ప్రస్తుతం అమల్లో ఉన్న ఈ టీఆర్పీ రేటింగ్స్ విధానానికి ప్రత్యామ్నాయంగా పారదర్శకతతో కూడిన వ్యవస్థని తీసుకొని రావాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం సాంకేతిక నిపుణులు , ఐటీ రంగ నిపుణులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేసింది కేంద్ర ప్రభుత్వం. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా సూచనల ప్రకారం డిజిటల్ సెట్-టాప్ బాక్సుల ద్వారా వచ్చే డేటాను రియల్-టైమ్‌లో పారదర్శకంగా చూసే విధానాన్ని ఈ ప్రత్యామ్నాయ వ్యవస్థ కోసం పరిశీలిస్తున్నారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం టెలివిజన్ ఇండస్ట్రీ ని , అడ్వర్టైజింగ్ రంగాన్ని తీవ్రగ్భ్రాంతికి గురిచేసింది. ఎందుకంటే ప్రతీ ఏటా వేల కోట్ల రూపాయిల ఆదాయం యాడ్స్ రూపం లో వచ్చేవి , ఇవన్నీ రేటింగ్స్ ఆధారంగానే జరిగేవి. ఇప్పుడు కొత్త వ్యవస్థ అమ్మల్లోకి వచ్చే వరకు రేటింగ్స్ నిలిపివేయడం వల్ల వంద కోట్ల నష్టాలు వాటిల్లే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి రాబోయే రోజుల్లో ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో చూడాలి.

# మహారాష్ట్రను ముంచెత్తుతున్న వానలు
# 200 మిమీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదు

ముంబై, జూలై 7

మహారాష్ట్ర వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు ఉగ్రరూపం దాల్చాయి. గత 48 గంటలుగా కురుస్తున్న అసాధారణ భారీ వర్షాలకు ఆర్థిక రాజధాని ముంబైతో పాటు సాంస్కృతిక రాజధాని పుణె నగరం పూర్తిగా స్తంభించిపోయాయి. ముఖ్యంగా పుణె జిల్లాలోని పశ్చిమ కనుమలు పరిధిలో మేఘమథనం జరుగుతోంది. ఘాట్ సెక్షన్లలోని పలు వాతావరణ కేంద్రాల్లో ఇప్పటికే 200 మిమీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదు కాగా, పుణె నగర పరిసర ప్రాంతాల్లో సగటున 100 మిమీ మార్కును దాటేసింది. ఈ జలప్రళయం కారణంగా ఇటు పుణె, అటు ముంబై, కొంకణ్ రీజియన్‌లలో జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తమైంది. భారత వాతావరణ శాఖ ముంబై, ఠాణే, పాల్ఘర్, రాయ్‌గఢ్ జిల్లాలకు అత్యంత ప్రమాదకరమైన రెడ్ అలర్ట్ జారీ చేసింది.




ఈ భారీ వర్షాల ధాటికి ముంబై-పుణె నగరాల మధ్య రవాణా వ్యవస్థ పూర్తిగా పడకేసింది. నిరంతరాయంగా కురుస్తున్న వానలకు ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్‌వే లోని ఖోపోలి-కుస్గావ్ మిస్సింగ్ లింక్ సొరంగం సమీపంలో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. టన్నుల కొద్దీ రాళ్లు, మట్టి రోడ్డుపైకి దూసుకురావడంతో ఎక్స్‌ప్రెస్‌వేతో పాటు పాత ముంబై-పుణె హైవేపై కూడా రాత్రీపగలు ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేశారు. ముంబై డివిజన్ పరిధిలోని థాకూర్వాడి - మంకీ హిల్ సెక్షన్ల మధ్య రైల్వే ట్రాక్‌లపై కూడా కొండరాళ్లు పడటంతో ముంబై-పుణె మధ్య నడిచే ఇంటర్‌సిటీ మరియు సుదూర ప్రాంతాల రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది లేదా దారిమళ్లించింది. వర్షాల తీవ్రతను దృష్ట్యా ముంబై, పుణె, ఠాణే, నవీ ముంబై పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలకు విద్యాశాఖ తక్షణ సెలవు ప్రకటించింది. ప్రైవేట్ ఆఫీసుల ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వాలని విపత్తు నిర్వహణ శాఖ సూచించింది. రహదారులపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

పుణె జిల్లాలోని మావల్ తహసీల్ పరిధిలో ఒక ఇల్లు కొండచరియల కింద నలిగిపోగా, ఇంద్రాయణి నది ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ఆలంది మున్సిపల్ కౌన్సిల్ నదిపై ఉన్న అన్ని వంతెనలను మూసివేసింది. పుణె-కోలాడ్ రోడ్డు ఒక విభాగంలో కుంగిపోవడంతో ఆ రూట్ క్లోజ్ అయింది. పర్యాటకుల భద్రత దృష్ట్యా ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన సింహగడ్ కోట ను రెండు రోజుల పాటు పూర్తిగా బంద్ చేశారు. పుణె శివార్లలో వరదల్లో చిక్కుకుపోయిన ఒక ప్రైవేట్ బస్సులోని 37 మంది ప్రయాణికులను ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ప్రాణాలకు తెగించి సురక్షితంగా రక్షించాయి.

ఇటు ముంబై నగరంలో పరిస్థితి మరింత దారుణంగా మారింది. విక్రోలి, కొలాబా, మాతుంగ వంటి లోతట్టు ప్రాంతాలు మోకాళ్లోతు నీటిలో మునిగిపోయాయి. పశ్చిమ రైల్వే పరిధిలోని వసాయ్ రోడ్ - విరార్ సెక్షన్లలో పట్టాలు పూర్తిగా నీట మునగడంతో 20 కి పైగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు మధ్యలోనే నిలిచిపోయాయి. ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో రన్‌వే రక్షణ చర్యల దృష్ట్యా విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మహారాష్ట్ర అసెంబ్లీని సైతం వర్షాల కారణంగా ఒకరోజు వాయిదా వేయాల్సి వచ్చింది. గత 3-4 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్ష సంబంధిత ఘటనల్లో 13 మంది ప్రాణాలు కోల్పోయారని విపత్తు నిర్వహణ మంత్రి గిరీష్ మహాజన్ ప్రకటించారు.

# సియా మహానటి..
# స్నాప్ చాట్ లో దొరికిపోయిన చేతన్

జైపూర్, జూలై 7,

ఆమె అమాయకురాలు కాదు. మహానటి.. కుటుంబ సభ్యుల ముందు నటించింది. కేతన్ అగర్వాల్ ముందు నటించింది. అతడు దగ్గరనుంచి కోటి రూపాయలు డబ్బు తీసుకుంది. కేతన్ అగర్వాల్ తల్లిదండ్రుల ముందు కూడా నటించింది. అతడిని రెండుసార్లు కోటకు తీసుకెళ్లింది. రెండుసార్లు కూడా అతడిని చంపే ప్రయత్నం విఫలమైంది. మూడోసారి బాలిదాకా వెళ్లాలి అనుకుంది. కానీ ఆ ప్లాన్ ఫ్లాఫ్ అయింది. చివరికి తన నటన కౌశలాన్ని ప్రదర్శించి కాబోయే వాడిని కోటకు తీసుకెళ్లింది. తన ప్రేమికుడితో లేపేసింది.మూడో కంటికి తెలియకుండా చంపేశాం కాబట్టి ఇబ్బంది లేదు.. దొరికిపోయే అవకాశం లేదు అనుకుంది సియా. కానీ చేసిన ఘోరం.. ఎప్పటికీ దాగదు. ఒక చిన్న ఆధారం సియాను పట్టించింది. ఆమె ప్రియుడిని దొరికేలా చేసింది. ఆ తర్వాత ఈ కేసును ప్రత్యేక పోలీసుల బృందం దర్యాప్తు చేయడం మొదలుపెట్టింది. ఈ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సియా కేతన్ నుంచి కోటి రూపాయలు వసూలు చేయడం.. వాటిని తన ప్రియుడు చేతన్ కు ఇవ్వడం.. చేతన్ కూడా కేతన్ అగర్వాల్ ను చంపే క్రమంలో తన ఫోన్ వాడకపోవడం.. తన కారును పక్కనపెట్టి వేరే వ్యక్తి బైక్ ఉపయోగించడం.. తన దగ్గర పనిచేస్తున్న వ్యక్తి ఫోన్ వాడటం వంటివి చేశాడు. దీంతో ఈ కేసులో బలమైన ఆధారాలు పోలీసులకు లభించాయి. దీనికి తోడు సియా వాడిన స్పై ఫోన్.. కోడింగ్ లాంగ్వేజ్ వంటివి పోలీసులకు అనుమానం కలిగించాయి. ఆ తర్వాత వాటిని డీకోడ్ చేస్తుంటే అసలు విషయాలు వెలుగు చూస్తున్నాయి.ఇప్పటిదాకా స్పై ఫోన్.. ఇతర ఆధారాలు మాత్రమే పోలీసులు సేకరించ గలిగారు. తాజాగా సియా స్నాప్ చాట్ లో జరిపిన ఓ సంభాషణ ఆమెను అడ్డంగా దొరికేలా చేసింది. స్నాప్ చాట్ లో సియా తన స్నేహితురాలికి వివాహ ఆహ్వానాన్ని పంపించింది. గెస్టులకు ఇచ్చే ఇంటర్ టికెట్ బుక్ చేసేందుకు ఆధార్ కార్డు పంపాలని ఆమెను కోరింది.. అయితే ఇక్కడ అసలు ట్విస్ట్ చోటు చేసుకుంది. ఎందుకంటే ఈ పెళ్లి జరగదని సియాకు తెలుసు. అదే విషయాన్ని స్నాప్ చాట్ లో ఆమె పేర్కొంది.. అంతేకాదు ఎలాగైనా సరే కేతన్ అడ్డు తొలగించుకోవాలని.. అతని శాశ్వతంగా వదిలించుకోవాలని సియా భావించింది. అందువల్లే స్నాప్ చాట్ లో ఈ పని చేసింది. వాస్తవానికి కేతన్ అంటే సియాకు ఇష్టం లేకపోయినప్పటికీ.. కుటుంబ సభ్యులు తీసుకురావడంతో ఆమె ఈ పని చేసినట్టు తెలుస్తోంది.. ఇప్పటికే సియా, చేతన్ ఫోన్ కాల్స్ ను పోలీసులు లోతుగా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్న సియా, చేతన్.. ఇప్పటికే అనేక విషయాలను చెప్పారు. ఇంకా ఈ కేసులో మరిన్ని నిజాలను రాబట్టడానికి పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు.

కేతన్ తాత మృతి

నచ్చిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలి అనుకున్నాడు. పెళ్లి కోసం భారీగా ఏర్పాట్లు చేసుకున్నాడు. దానికోసం భారీగా ఖర్చు పెట్టాడు. ఏకంగా 17 కోట్లు పెట్టి రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయపూర్ ప్రాంతంలో ఒక అత్యంత విలాసవంతమైన హోటల్ బుక్ చేసుకున్నాడు. తన పెళ్లికి వచ్చే అతిథులను తీసుకురావడానికి హెలికాప్టర్లను బాడుగకు మాట్లాడుకున్నాడు.. అప్పట్లో ఎంగేజ్మెంట్ కూడా చాలా గట్టిగా చేసుకున్నాడు. బిజినెస్ సర్కిల్స్ మొత్తం తన గురించి మాట్లాడుకునేలాగా చేశాడు.చిన్న వయసులోనే స్థిరాస్తి వ్యాపారం లోకి వచ్చి భారీగా సంపాదించాడు. తన జీవితంలోకి వచ్చే అమ్మాయి గురించి గొప్ప గొప్ప కలలు కన్నాడు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. ఆ తర్వాత అతడి జీవితం మరో విధంగా మారింది. విధి పగబట్టింది. కాబోయే భార్య అతడిని చంపేసింది. పైగా ఆమెకు మరొక వ్యక్తితో సంబంధం ఉంది. తన ప్రేమికుడితో కలిసి తనకు కాబోయే భార్య తనను చంపేస్తుందని అతడు ఊహించలేదు. రెండుసార్లు తనను చంపే ప్రయత్నం విఫలమైందని అతడు చనిపోయిన తర్వాత తెలుసుకున్నాడు. అయినప్పటికీ జరగాల్సిన ఘోరం జరిగిపోయింది.ఇదంతా కూడా ఇటీవల కాలంలో మనం చూస్తున్న.. చదువుతున్న కేతన్ అనే స్థిరాస్తి వ్యాపారికి సంబంధించిన దీనగాథ. అతడు పోయిన బాధ నుంచి ఇంకా కుటుంబం తేరుకోలేదు. ఆ కేసు ఇంకా విచారణ దశలో ఉంది. రకరకాల మలుపులు తిరుగుతోంది. అతడు చనిపోయిన విషాదం గుండెను మెలి తిప్పుతుండగానే.. కేతన్ కుటుంబంలో మరో విషాదం చోటు చేసుకుంది.కేతన్ తాత దేవిచంద్ అగర్వాల్ అనారోగ్యంతో కన్నుమూశారు. కేతన్ చనిపోయిన దగ్గరనుంచి ఆయన ఆరోగ్య పరిస్థితి దారుణంగా మారిపోయింది. శనివారం రాత్రి అతనికి గుండెపోటు రావడంతో చనిపోయారు.. దీంతో కేతన్ కుటుంబం మరింత విషాదంలో కూరుకుపోయింది. కొడుకు మరణం.. తండ్రి మరణం.. ఇవన్నీ కూడా కేతన్ అగర్వాల్ తండ్రికి నరకం చూపిస్తున్నాయి. ఆయన విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టిస్తోంది.

# రోడ్డు ప్రమాదం లో ఒకరి మృతి

మచిలీపట్నం

మచిలీపట్నం?కత్తిపూడి 216 జాతీయ రహదారిపై పెడన సమీపంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగాయలంక సమీపంలోని దీనదయాళపురం గ్రామానికి చెందిన సంతోశ్రావు (47) మృతి చెందారు.

సంతోశ్రావు పెడనలో రైల్వే ట్రాక్పై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పనుల వద్ద సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి విధులు ముగించుకుని మంగళవారం ఉదయం తోటమూలలోని తన ఇంటికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఉదయం 5 గంటల సమయంలో పెడన సమీపంలో గుర్తుతెలియని వాహనం ఆయన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో సంతోశ్రావు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద తీవ్రతకు ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వాహనం 100 అడుగులకు పైగా ఈడ్చుకెళ్లినట్లు సమాచారం.

సంఘటనా స్థలాన్ని పెడన సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. నాగేంద్రప్రసాద్, పెడన ఎస్సై జి. సత్యనారాయణ పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.మృతుడు సంతోశ్రావుకు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురు పిల్లలు చదువుకుంటున్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

=====================శ్రీ

# డిజిటల్' పాలిటిక్స్ వర్సెస్ 'రోడ్ పాలిటిక్స్

హైదరాబాద్, జూలై 7, (

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అత్యంత కీలకమైన, అనూహ్యమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి అన్నట్లు బీఆర్ఎస్ ఇంకా పూర్తిస్థాయి ప్రతిపక్ష పాత్ర పోషించడం లేదు అనే అసంతృప్తి నిజమేనని నిరూపిస్తూ.. గులాబీ గూటిలో పెద్ద చీలికే వచ్చేసింది. కేటీఆర్ లీడర్‌షిప్ స్టైల్ నచ్చక, పార్టీ అంతర్గత విభేదాలతో బీఆర్ఎస్ నుండి సస్పెండ్ అయిన కల్వకుంట్ల కవిత.. ఏకంగా తెలంగాణ రక్షణ సేన పేరుతో సరికొత్త ప్రాంతీయ పార్టీని స్థాపించి జోరుగా ప్రజల్లోకి వెళు ్తన్నారు. కేటీఆర్ కేవలం సోషల్ మీడియా వేదికగా, ఏసీ రూముల్లో ప్రెస్ మీట్లు పెడుతూ డిజిటల్ పోరాటాలు చేస్తుంటే.. సొంత పార్టీ పెట్టుకున్న కవిత మాత్రం పాత ఉద్యమ శైలిని అందిపుచ్చుకుని నేరుగా రోడ్లెక్కి వీధి పోరాటాలు చేస్తుండటం గులాబీ కేడర్‌లో హాట్ టాపిక్‌గా మారింది.కార్పొరేట్ తరహాలో సాగే కేటీఆర్ హైటెక్ పాలిటిక్స్‌కు కాలం చెల్లిందని భావించిన కవిత.. గ్రౌండ్ లెవెల్‌లో కరడుగట్టిన తెలంగాణ సెంటిమెంట్‌ను, నిరుద్యోగుల సమస్యలను ఎజెండాగా మార్చుకున్నారు. ఇటీవల బోడుప్పల్ పరిధిలో ప్రభుత్వ భూముల కేటాయింపు, ఉద్యమకారుల సంక్షేమం కోసం తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఆమె నేరుగా రంగంలోకి దిగి, పోలీసులతో వాగ్వాదానికి దిగి రోడ్డుపై బైఠాయించి అరెస్టయ్యారు. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక ఇలా లాఠీలకు ఎదురునిలిచి అరెస్ట్ అయిన దాఖలాలు లేకపోవడంతో.. బీఆర్ఎస్ కిందిస్థాయి కేడర్ ఇప్పుడు కవిత నాయకత్వం గురించి చర్చించుకుంటున్నారు. సమస్యల పై పోరాడే అసలైన వారసురాలు కవితే అనే నరేటివ్‌ను ఆమె క్షేత్రస్థాయిలో బలంగా నిర్మిస్తున్నారు.

అయితే కవితకు సమస్యలు సమస్యలు వస్తున్నాయి. ఆమె ప్రతిపాదించిన తెలంగాణ రక్షణ సేన ంఖీూ అనే సంక్షిప్త నామంపై తీవ్ర అభ్యంతరాలు రావడంతో.. 15 రోజుల్లోగా మూడు ప్రత్యామ్నాయ పేర్లను సమర్పించాలని, లేదంటే అప్లికేషన్ క్లోజ్ చేస్తామని ఈ? స్పష్టం చేసింది. అయితే, పేరు మార్చే ప్రసక్తే లేదని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తానని కవిత సవాల్ విసిరారు.ఈ విప్లవాత్మక పోరాటాలు, కొత్త పార్టీ స్థాపన కవిత రాజకీయ భవిష్యత్తుకు ఖచ్చితంగా ఒక టర్నింగ్ పాయింట్‌గా మారేలా కనిపిస్తున్నాయి. కేసీఆర్ స్థాపించిన పాత తెలంగాణ రాష్ట్ర సమితి ని భారత్ రాష్ట్ర సమితి గా మార్చడం వల్లే తెలంగాణలో పార్టీ అధికారం కోల్పోయిందని నమ్మే పాత ఉద్యమకారులంతా ఇప్పుడు కవిత వెంటే నడవడానికి సిద్ధమవుతున్నారు. తాము రక్తం, చెమట చిందించి నిర్మించుకున్న ంఖీూ అనే ఐడెంటిటీని తానే కాపాడుకుంటానని కవిత చెప్పడం సెంటిమెంట్‌గా కేడర్‌ను అమితంగా ఆకర్షిస్తోంది. ఈ కొత్త పొలిటికల్ ఈక్వేషన్ కేటీఆర్‌ను తీవ్ర రక్షణలో పడేస్తోంది. ఒకవైపు అధికార కాంగ్రెస్‌ను ట్విట్టర్‌లో ఢీకొట్టడం కంటే.. సొంత చెల్లెలు పెట్టిన పార్టీ వైపుకు తమ కేడర్ వలస వెళ్లకుండా చూసుకోవడమే కేటీఆర్‌కు ఇప్పుడు పెద్ద టాస్క్‌గా మారింది. కవిత రోడ్లెక్కి మైలేజ్ పెంచుకుంటుంటే.. బీఆర్ఎస్ ఇంకా కేవలం ట్వీట్లకే పరిమితమైతే, భవిష్యత్తులో తెలంగాణలో అసలైన ప్రతిపక్ష హోదాను కూడా కవిత కొత్త పార్టీ చేజిక్కించుకునే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముగింపుగా చూస్తే.. అన్న 'డిజిటల్ వాట్సాప్' పాలిటిక్స్ చేస్తుంటే, చెల్లెలు మాత్రం 'రోడ్ పాలిటిక్స్' తో తెలంగాణ అసెంబ్లీ సమీకరణాలను మార్చడానికి దూసుకుపోతున్నారు. ఈ అన్నదమ్ముల, అన్నాచెల్లెళ్ల పొలిటికల్ వార్ రాబోయే రోజుల్లో ఏ మలుపు తిరుగుతుందో చూడాలి.

# ఒవైసీ విద్యా సంస్థలపై రాజకీయ రంగు

హైదరాబాద్, జూలై 7,

తెలంగాణలో ఓవైసీల నేతృత్వంలోని ఫాతిమా విద్యాసంస్థల భూముల వ్యవహారం మరోసారి రాజకీయంగా, న్యాయపరంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం, కోర్టుల అక్షింతలు, అధికార-విపక్షాల మధ్య సవాల్-ప్రతిసవాళ్లతో ఈ అంశం రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తోంది. నిబంధనల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడంలో జరుగుతున్న జాప్యంపై హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేయగా, ఈ వ్యవహారం కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం పార్టీల మధ్య పదునైన విమర్శల యుద్ధానికి దారితీసింది.ఫాతిమా విద్యాసంస్థల ఉల్లంఘనలపై విచారణ సందర్భంగా ప్రభుత్వ విభాగాలు కోర్టుకు సమర్పించిన నివేదికలు, చెప్పిన సమాధానాలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తాము ఈ సంస్థలకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని హైకోర్టుకు స్పష్టం చేసింది. తాము ప్రస్తుతం సర్వే వ్యవహారాల్లో బిజీగా ఉన్నామంటూ కాలయాపన సమాధానం ఇచ్చింది. నివేదిక ఇచ్చేందుకు కొంత గడువు కావాలని కోరింది. చెరువులు, నాలాల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా.. ఇతర శాఖల నుంచి స్పష్టమైన నివేదికలు వస్తేనే తాము తదుపరి చర్యలు తీసుకోగలమని వివరించింది. ఒకరిపై ఒకరు నెపం నెట్టేస్తూ, బాధ్యతల నుంచి తప్పుకునేలా ఉన్న ప్రభుత్వ శాఖల తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టులు ఇన్నిసార్లు చీవాట్లు పెడుతున్నా, క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడంలో ఎందుకు జాప్యం జరుగుతోందని న్యాయస్థానం నిలదీసింది.హైకోర్టు వ్యాఖ్యలను అస్త్రంగా చేసుకుని విపక్షాలు ప్రభుత్వంపై విమర్శల దాడిని పెంచాయి. ముఖ్యంగా బీజేపీ ఈ వ్యవహారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అక్రమ కట్టడాలపై బుల్డోజర్లు నడుపుతామని చెప్తున్న హైడ్రా, ఫాతిమా విద్యాసంస్థల జోలికి ఎందుకు వెళ్లడం లేదని బీజేపీ ప్రశ్నిస్తోంది.కేంద్రమంత్రి బండి సంజయ్ ఈ వివాదంపై అత్యంత ఘాటుగా స్పందించారు. తాము అధికారంలోకి వస్తే ఓవైసీ విద్యాసంస్థలను కూల్చేస్తామని బహిరంగంగా ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపాయి.దీనికి ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ అంతే దీటుగా కౌంటర్ ఇచ్చారు. "ఒక విద్యాసంస్థను కూల్చితే.. వంద విద్యాసంస్థలను కడతాం" అంటూ సవాల్ విసిరారు. తమ విద్యాసంస్థలను, మైనారిటీల హక్కులను ఎలా కాపాడుకోవాలో తమకు బాగా తెలుసంటూ ఆయన స్పష్టం చేశారుఅక్బరుద్దీన్ ఓవైసీ కామెంట్స్ పై మరో కేంద్రమంత్రి, బీజేపీ నేత కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఓవైసీ సోదరులు బహిరంగంగా ప్రభుత్వాన్ని, చట్టాన్ని బెదిరిస్తున్నా రేవంత్ రెడ్డి సర్కార్ ఎందుకు వెనకడుగు వేస్తోందని ఆయన ప్రశ్నించారు. ఓవైసీ అంటే రేవంత్ రెడ్డికి అంత భయమా అని నిలదీశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం అక్రమాలను చూసీచూడనట్లు వదిలేస్తోందని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.ఫాతిమా విద్యాసంస్థల వ్యవహారం కేవలం ఒక భూ వివాదంగానే కాకుండా, తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా మారింది. ఒకవైపు హైడ్రా యాక్షన్‌తో దూసుకుపోతున్నట్లు కనిపిస్తున్నా, ఎంఐఎం నేతలకు సంబంధించిన వ్యవహారాల్లో మాత్రం వెనకడుగు వేస్తోందనే ఇంప్రెషన్ ప్రజల్లో బలంగా కనిపిస్తోంది. ప్రభుత్వ విభాగాలు కోర్టులో పొంతన లేని సమాధానాలు చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనా సామర్థ్యంపై ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ గ్యాప్‌ను వాడుకుని తెలంగాణలో తామే ప్రధాన ప్రత్యామ్నాయం అని నిరూపించుకునేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. కోర్టు తదుపరి ఆదేశాలు ఎలా ఉండబోతున్నాయి? హైడ్రా నిజంగానే చర్యలకు ఉపక్రమిస్తుందా? లేదా ప్రభుత్వ శాఖల మధ్య ఫైళ్ల కదలికల పేరుతో కాలయాపన జరుగుతుందా? అన్నది ఇప్పుడు సస్పెన్స్‌గా మారింది.

# బీటెక్ ఉద్యోగుల జీతాల మించి శానిటరీ ఉద్యోగుల జీతాలే...

హైదరాబాద్, జూలై 7,

హైదరాబాద్ మహానగరపాలక సంస్థ ఐటీ నిపుణుల కొరతను తీర్చేందుకు జారీ చేసిన ఒక టెండర్ నోటిఫికేషన్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నగరంలో ఎంతో నైపుణ్యం కలిగిన ఐటీ ఉద్యోగులకు ఆఫర్ చేస్తున్న వేతనాలు శాశ్వత శానిటేషన్ కార్మికుల జీతాల కంటే చాలా తక్కువగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. జీహెచ్ఎంసీ ఒక సంవత్సరం కాల పరిమితిపై ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 25 మంది ఐటీ ప్రొఫెషనల్స్‌ను నియమించుకోవడానికి తాజాగా నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. అయితే ఇందులో ప్రతిపాదించిన పే స్కేల్ ప్రస్తుతం హాట్ టాఫిక్‌గా మారింది.ఈ అధికారిక నోటిఫికేషన్ ప్రకారం.. హార్డ్‌వేర్ ఇంజనీర్లు, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్లు, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్లు, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్లు, ప్రోగ్రామర్లు, టీమ్ లీడర్లు, జీఐఎస్ అనలిస్టులు, వెబ్ డిజైనర్ల వంటి వివిధ విభాగాల నిపుణుల కోసం జీహెచ్ఎంసీ దరఖాస్తులను కోరింది. అయితే వీరికి కేటాయించిన వేతనాల వివరాలు గమనిస్తే.. 12 మంది హార్డ్‌వేర్ ఇంజనీర్ల పోస్టులకు నెలకు రూ. 28 వేల చొప్పున వేతనం ప్రతిపాదించారు. కనీసం మూడేళ్ల అనుభవంతో పాటు ఎంటెక్ ఉన్నత విద్యార్హత కలిగిన సీనియర్ జీఐఎస్ అనలిస్ట్‌కు నెలకు రూ. 37 వేలు మాత్రమే చెల్లించనున్నారు. బీటెక్ విద్యార్హతతో పాటు ఆరు సంవత్సరాల సుదీర్ఘ అనుభవం గల వెబ్ డిజైనర్ పోస్టుకు కేవలం రూ. 42 వేలు వేతనంగా నిర్ణయించారు.ఈ వేతన ప్యాకేజీలను జీహెచ్ఎంసీలోని శానిటేషన్ కార్మికుల జీతాలతో పోల్చి చూస్తే ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగుచూశాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధుల సమాచారం ప్రకారం.. జీహెచ్ఎంసీలో కొత్తగా చేరే శానిటేషన్ కార్మికులకే (ఔట్ సోర్సింగ్ కాకుండా) ప్రారంభంలో నెలకు రూ. 30 వేల నుంచి రూ. 35 వేల వరకు వేతనం అందుతోంది. ఇక కార్పొరేషన్‌లో శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్న సీనియర్ శానిటేషన్ కార్మికులు తమ సర్వీసు కాలాన్ని బట్టి నెలకు రూ. 50 వేల నుంచి గరిష్టంగా రూ. 80 వేల వరకు జీతాలు అందుకుంటున్నారు. విద్యార్హతలతో సంబంధం లేకపోయినా సీనియారిటీ కారణంగా వారి జీతాలు ఐటీ ఉద్యోగుల కంటే ఎంతో మెరుగ్గా ఉన్నాయి.ఈ తక్కువ వేతనాల వ్యత్యాసంపై జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందిస్తూ.. ఐటీ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి గత ఐదేళ్లుగా ఎలాంటి పే-స్కేల్ సవరణలు జరగకపోవడమే దీనికి ప్రధాన కారణమని వివరించారు. ప్రభుత్వం 2022 సంవత్సరం నుంచి ఔట్‌సోర్సింగ్ ఐటీ పోస్టులకు సంబంధించి పీఆర్సీ నిబంధనలను అమలు చేయకపోవడంతో పాత జీతాలనే కొనసాగించాల్సి వస్తోందని పేర్కొన్నారు. కాగా, ఇలా తక్కువ జీతాలు పొందుతున్న ఐటీ ఉద్యోగులు జీహెచ్ఎంసీలో సాఫ్ట్‌వేర్ వెబ్ అప్లికేషన్ డెవలప్‌మెంట్, సర్వర్లు, డెస్క్‌టాప్‌లు, ప్రింటర్ల నిర్వహణతో పాటు మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ విభాగానికి సలహాలు అందించడం వంటి కీలక సాంకేతిక బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

## ప్రహ్లాదపురంలో ఘోరం: వృద్ధురాలిని హత్య చేసి, బంగారం దోచుకెళ్లిన దుండగులు

పెందుర్తి: స్థానిక ప్రహ్లాదపురంలో అర్ధరాత్రి వేళ ఓ దారుణ ఘటన వెలుగుచూసింది. ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న కర్రీ పైడమ్మ (72) అనే వృద్ధు రాలిని గుర్తుతెలియని దుండగులు అత్యంత కిరాతకంగా దాడి చేసి హత్య చేశారు. అనంతరం ఆమె శరీరంపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుని పారిపోయారు ?ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 112 ద్వారా పోలీసులకు సమా చారం అందించారు దీంతో పెందుర్తి సీఐ సతీశ్ కుమార్ తన సిబ్బందితో కలిసి వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు క్లూస్ టీమ్ రంగంలోకి దిగి అక్కడ లభించిన ఆధారాలను సేకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ను వేగవంతం చేశారు ?ఈ ఘోర కలికలం స్థానిక ప్రజల్లో తీవ్ర భయాం దోళనలను కలకలాన్ని రేపింది.

# గులాబీకి మల్లారెడ్డి గుడ్ బై...



హైదరాబాద్, జూలై 7,

తనదైన డైలాగులు, విలక్షణమైన రాజకీయ శైలితో నిత్యం సోషల్ మీడియాలో, ప్రజల్లో హల్‌చల్ చేసే మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి చేసిన తాజా వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర సంచలనంగా మారాయి. తాజాగా ఓ కార్యకర్త జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఆయన, "ఃఖీూకు దూరమయ్యానని నన్ను మర్చిపోతున్నారు" అంటూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. బీఆర్ఎస్ పార్టీకి ఆయన గుడ్ బై చెప్పి, త్వరలోనే భారతీయ జనతా పార్టీ తీర్థం పుచ్చుకోబోతున్నారనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్న తరుణంలో ఈ కామెంట్స్ రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ అగ్రనేతల వద్ద అత్యంత కీలక వ్యక్తిగా, పార్టీకి ప్రధాన బలంగా నిలిచిన మల్లారెడ్డి, అధికారం కోల్పోయిన తర్వాత కూడా చాలాకాలంపాటు ఆయన పార్టీలో చురుగ్గా ఉండేవారు. కానీ కొంతకాలంగా అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఆయన పార్టీ ప్రధాన కార్యాలయమైన తెలంగాణ భవన్ వైపు రావడం పూర్తిగా తగ్గించేశారు. కేటీఆర్, హరీశ్ రావు వంటి పార్టీ ముఖ్య నేతలు నిర్వహించే ప్రెస్ మీట్లు, కీలక సమావేశాల్లోనూ మల్లారెడ్డి మునుపటిలా యాక్టివ్‌గా కనిపించడం లేదు. కాంగ్రెస్, బీజేపీ, చివరికి టీడీపీలో చేరేందుకు కూడా ఆయన ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం చాలా రోజులుగా నడుస్తోంది. తాజాగా "నేను బీఆర్ఎస్‌కు దూరమయ్యానని నన్ను దూరం పెడుతున్నారు" అంటూ నేరుగా కార్యకర్తల సమక్షంలో వ్యాఖ్యానించడం.. ఆయన పార్టీ మారడం ఖాయమనే సంకేతాలను ఇస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.మల్లారెడ్డి కుటుంబం బీజేపీ వైపు చూస్తోందనడానికి మరో ప్రధాన కారణం.. ఆయన కోడలు డాక్టర్ ప్రీతిరెడ్డి ఇటీవల చేసిన కొన్ని ఆసక్తికర కామెంట్స్ కూడా ఉన్నాయి. ఆమె ఓ ఇంటర్వ్యూలో ప్రధాని నరేంద్ర మోడీపై ప్రశంసలు కురిపించడం పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. అంతేకాకుండా, ఆమె బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి అక్కడ ఆ పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ సహా కీలక నేతలతో భేటీ కావడం చర్చకు దారితీసింది. అయితే, ఇది కేవలం డిజిటల్ ఇండియా ఈవెంట్ గురించిన భేటీ అని, రాజకీయ ప్రాధాన్యత లేదని ఆమె వివరణ ఇచ్చినప్పటికీ ఊహాగానాలు మాత్రం ఆగలేదుప్రస్తుతం మల్లారెడ్డి, ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి ఇద్దరూ బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. అయితే, భవిష్యత్తులో రాబోయే మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో ఉంచుకుని మల్లారెడ్డి ఫ్యామిలీ ఒక పెద్ద స్కెచ్ వేసినట్లు తెలుస్తోంది. తమ కుటుంబానికి రాబోయే రోజుల్లో ఒక పార్లమెంటు నియోజకవర్గంతో పాటు అందులోని నాలుగు అసెంబ్లీ టికెట్లు కేటాయించాలనే షరతుపై అటు బీఆర్ఎస్, ఇటు బీజేపీ అధిష్టానాల నుంచి గట్టి హామీ పొందే ప్రయత్నాల్లో మల్లారెడ్డి ఫ్యామిలీ ఉన్నట్లు పొలిటికల్ కారిడార్‌లో గట్టిగా వినిపిస్తోంది.ఈ నేపథ్యంలోనే మల్లారెడ్డి అత్యంత వ్యూహాత్మకంగా "నన్ను మర్చిపోతున్నారు" అంటూ సానుభూతి కార్డ్ ప్లే చేశారా? లేక నిజంగానే బీఆర్ఎస్ శ్రేణులు తనను దూరం పెట్టడం వల్లే ఆవేదనతో అన్నారా? అనేది తేలాల్సి ఉంది. ఏది ఏమైనా, మల్లారెడ్డి తాజా వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు తెరలేపబోతున్నాయనేది మాత్రం స్పష్టమవుతోంది.

# 70 ఏళ్ల జీ హెచ్ ఎంసీ చట్టానికి ఫుల్ స్టాప్

హైదరాబాద్, జూలై 7,

తెలంగాణలోని సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మహానగర పాలనలో మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో 70ఏళ్ల జీహెచ్ఎంసీ చట్టానికి స్వస్తి చెప్పబోతోంది. మూడు కార్పొరేషన్ల (జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ) కలిపి కొత్త చట్టాన్ని తీసుకువస్తోంది. ఈ మేరకు క్యూర్ ముసాయిదా బిల్లు (ఇంటిగ్రేటెడ్ గవర్నెన్స్) -2026ను ఆదివారం విడుదల చేసింది. ఈ బిల్లులో 43 చాప్టర్లు, తొమ్మిది షెడ్యూళ్లు ఉన్నాయి. జూలై 24 వ తేదీ వరకు ప్రజాభిప్రాయాలు, సూచనలు స్వీకరించనున్నట్లు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి (ఎంఏయూడీ) శాఖ ప్రకటించింది.తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) 2026 ముసాయిదా బిల్లు అమల్లోకి వస్తే హైదరాబాద్ పరిధిలోని ఆస్తి యాజమానులపై పన్నుభారం పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అమలులో ఉన్న వార్షిక అద్దె విలువ విధానానికి బదులుగా, ఆస్తి మూలధన విలువ ఆధారంగా ప్రాపర్టీ ట్యాక్స్ ను నిర్ణయించే విధానాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది. అంతేకాక.. రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వం నిర్ణయించే మార్కెట్ విలువను ఆధారంగా తీసుకొని స్థలాలు, భవనాలపై ఆస్తిపన్ను విధించనున్నారు. దీంతో ముఖ్యంగా పాత జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న అనేక ఆస్తులపై పన్ను గణనీయంగా పెరిగే అవకాశాలు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఉన్న భవనాలకు పన్ను పెంపును దశలవారీగా అమలు చేసే అవకాశం ఉంది. కొత్తగా నిర్మించే భవనాలకు కొత్త విధానం వెంటనే అమల్లోకి వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్న వివరాల ప్రకారం తెలుస్తోందక్యూర్ ముసాయిదా బిల్లు అమల్లోకి వస్తే.. క్యూర్ పరిధిలో అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపడతారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టినా.. అందులో ఎవరైనా నివాసం ఉండే పరిస్థితి ఉన్నా.. కమిషనర్లు 24 గంటల ముందు నోటీసులు ఇచ్చి సీజ్ చేయొచ్చు. ఒకవేళ ప్రజల భద్రతకు ఇబ్బందిగా ఉంటే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే సీజ్ చేసే అవకాశం ఉంటుంది. క్యూర్ చట్టంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఆరోగ్యానికి ప్రాధాన్యతనిచ్చారు. ఖాళీ స్థలాల్లో చెత్త ఉంటే ప్లాట్ మూలధన విలువలో 0.25శాతం మేర జరిమానా విధిస్తారు. చెత్త తొలగించే వరకు జరిమానాల విధింపు ఉంటుంది. ఈ విధానం ద్వారా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.క్యూర్ చట్టం ముసాయిదాలో ఆహార భద్రతకు సంబంధించి కీలక ప్రతిపాదనలు ఉన్నాయి. కొత్త చట్టంలో అధ్యాయం-33లో ఆహార భద్రత, పోషకాహారం అంశాలను చేర్చారు. దీని ప్రకారం పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి చైర్మన్‌గా, ఫుడ్ సేఫ్టీ కమిషనర్ కన్వీనర్‌గా 'ఆహార భద్రత, పోషకాహార కమిటీ' ఏర్పాటు చేస్తారు. క్యూర్ పరిధిలో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల అమలును ఈ కమిటీ పర్యవేక్షిస్తుంది. పర్యావరణం పరిరక్షణకూ ఈ క్యూర్ బిల్లులో ప్రాధాన్యత ఇచ్చారు. విపత్తుల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయనున్నారు. ఏదైనా విపత్తు తలెత్తితే ప్రభుత్వ శాఖలను అప్రమత్తం చేయడానికి క్యూర్ స్మార్ట్ గవర్నెన్స్ సెంటర్ ఏర్పాటు చేస్తారు. అంతేకాక హైడ్రాకు చట్టబద్ధ గుర్తింపు కల్పిస్తూ చెరువులు, కాలువలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యతలను పూర్తిస్థాయిలో అప్పగించనున్నారు.క్యూర్ బిల్లులో సెక్షన్ -168 ప్రకారం.. అనుమతిలేని ఆస్తులు, అక్రమ నిర్మాణాల క్రయ విక్రయాలు, బదిలీలు నిషేధం, అనధికార నిర్మాణాల యాజమానులకు సంబంధిత అధికారి నోటీస్ జారీ చేసి నిషేధిత జాబితాలో చేర్చుతారు. ఈ నూతన బిల్లు ద్వారా నైట్ ఎకానమీకి ప్రోత్సాహం అందించే కీలక ప్రతిపాదన చేశారు. పలు ప్రాంతాలను నైట్ ఎకానమీ జోన్లుగా ప్రకటించి రాత్రంతా వ్యాపారాలకు అనుమతి ఇవ్వనున్నారు. క్యూర్‌లోని ప్రజలకు అన్ని అత్యవసర సేవలకు ఒకే ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి తెస్తారు.క్యూర్ బిల్లును ప్రజా సంప్రదింపుల కోసం అందుబాటులో ఉంచినట్లు ప్రభుత్వం తెలిపింది. పౌరులు తమ అభిప్రాయాలు, సూచనలను ఆన్‌లైన్ ద్వారా (ష్ట్రబిబిజూబ://ఇష్ట్రఎఇ.ఐనీల.తిని/ఇ-జీబివణనీతీఎచితిబివ ఎనిబివతీబిఖీవజూనీతీబి.జీబజూలీ) సమర్పించాలని పేర్కొంది. మూడు కార్పొరేషన్ల వెబ్ సైట్లలో ముసాయిదా బిల్లును అందుబాటులో ఉంచినట్లు తెలిపింది. రాతపూర్వకంగా కూడా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ, సచివాలయం, హైదరాబాద్‌కు తమ సూచనలను పంపొచ్చని ప్రభుత్వం తెలిపింది. అయితే, ఈ సూచనలు, అభ్యంతరాలను కేవలం జులై 24వ తేదీ వరకు మాత్రమే స్వీకరించటం జరుగుతుందని ప్రభుత్వం ప్ష్టం చేసింది.

# ఆహార కల్తీ నియంత్రణకు హైడ్రా తరహా చట్టం

హైదరాబాద్, జూలై 7,

తెలంగాణలో ఆహారకల్తీ, డ్రగ్స్ నివారణకు ప్రభుత్వం కొత్తగా ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయనుంది. సీఎస్ సంజయ్‌జాజు, డీజీపీ సీవీ ఆనంద్‌ల సమీక్షలో ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ విభాగాలను ఒకే గొడుకు కిందకు తెస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ కొత్త శాఖకు ఒకే విభాగాధిపతి ఉంటారు. దీని పరిధిలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎఫ్ఎస్ఎల్, ప్రాసిక్యూషన్ విభాగాలు పనిచేస్తాయి. కల్తీ ముఠాలపై ఉక్కుపాదం మోపేందుకు గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల నుంచి వెనక్కి వచ్చిన సిబ్బందిని ఈ కొత్త విభాగంలోకి పంపించనున్నారు.తెలంగాణలో ఆహారకల్తీ అతి పెద్ద సమస్యగా మారింది. వంటింటి సామాన్ల నుంచి పిల్లలు తినే చాక్లెట్లు, బిస్కెట్ల వరకు ప్రతిదీ కల్తీ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఈ నేపథ్యంలో కల్తీని పూర్తిగా అణచివేసేందుకు తెలంగాణ ప్రభుత్వం వ్యూహాత్మక కార్యాచరణను ప్రారంభించింది. ఆహారకల్తీ నియంత్రణ కోసం కొత్తగా ప్రత్యేక శాఖ లేదా విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు.ప్రస్తుతం విడివిడిగా కొనసాగుతున్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ విభాగాలను ఒకే గొడుకు కిందకు తీసుకురానున్నారు. ఈ రెండు కీలక విభాగాలనూ విలీనం చేస్తూ ఏర్పడే ఈ కొత్త సూపర్ విభాగానికి ఒకే ఒక సమర్థుడైన విభాగాధిపతి నేతృత్వం వహించేలా తగిన అధికారిక చర్యలు తీసుకుంటున్నారు. ఆహార, ఔషధ రంగానికి చెందిన నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఉక్కుపాదం మోపేలా.. ఈ సరికొత్త శాఖ పరిధిలోనే ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్, లీగల్ సెల్, ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ ల్యాబ్స్, పటిష్టమైన ప్రాసిక్యూషన్ విభాగాలను కూడా అంతర్భాగంగా ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.మరోవైపు.. రాష్ట్రంలో యువత భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తున్న మాదకద్రవ్యాల కేసులను, అక్రమ రవాణాను సమూలంగా అరికట్టేందుకు కూడా ఈ శాఖ అత్యంత చురుగ్గా పనిచేస్తుందని ఉన్నతాధికారుల బృందం భావిస్తోంది. ఈ కొత్త రక్షణ విభాగానికి అత్యంత నైపుణ్యం కలిగిన బలగాల దళాన్ని కేటాయించనున్నారు. ఇందులో భాగంగానే ఇటీవలే ఎలైట్ యాంటీ-నక్సల్ ఫోర్స్ అయిన గ్రేహౌండ్స్, ఉగ్రవాద నిరోధక విభాగం ఆక్టోపస్‌ల నుంచి వెనక్కి పిలిపించిన అనుభవజ్ఞులైన పోలీసు సిబ్బందిని, కమాండోలను కొత్తగా ఏర్పాటు చేయబోయే ఈ ప్రతిష్టాత్మక ప్రత్యేక శాఖలోకి బదిలీ చేసేందుకు పరిపాలనాపరంగా రంగం సిద్ధం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు, తయారీ కేంద్రాలలో నాణ్యతా ప్రమాణాలను పర్యవేక్షించడంతో పాటు, నకిలీ మందుల ముఠాల గుట్టు రట్టు చేయడానికి ఈ కమాండో తరహా నిఘా విభాగం పగడ్బందీగా పనిచేయనుంది. అంతర్గత కసరత్తులన్నీ దాదాపు తుది దశకు చేరుకున్నందున త్వరలోనే ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ఈ సరికొత్త ఆహార, ఔషధ నియంత్రణ ప్రత్యేక శాఖ అధికారికంగా అందుబాటులోకి రానుందని అధికారులు వెల్లడించారు.

# దళితులు, గిరిజనులు అంటే కూటమి ప్రభుత్వానికి చిన్నచూపా...?

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య




నరసరావుపేట, పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండల పరిధిలోని కండ్రిగ, గుట్టపల్లి, గంగుపల్లి గ్రామాలకు తక్షణమే తాగునీరు, సాగునీరు కల్పించాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో పల్నాడు కలెక్టర్ కార్యాలయం వద్ద ఆయా గ్రామాల ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కృతిక శుక్లకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు కావస్తున్నా ప్రజలకు కనీస తాగునీటి సదుపాయం కూడా కల్పించలేకపోవడం పాలకుల వైఫల్యమని విమర్శించారు. గ్రామాల్లో ప్రజలతో పాటు పశువులకు కూడా తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు.''పెద్ద పెద్ద పట్టణాలు నిర్మించామని, భారీ భవనాలు కట్టామని ప్రగల్భాలు పలికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గ్రామీణ ప్రజలకు కనీసం తాగునీరు కూడా అందించలేని పరిస్థితి ఎందుకు ఏర్పడిందో చెప్పాలి" అని ప్రశ్నించారు. ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పరిధిలోనే ఈ గ్రామాలు ఉన్నప్పటికీ త్రాగునీటి సమస్యలు ఎందుకు పరిష్కారం కావడం లేదని నిలదీశారు.కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న కూటమి ప్రభుత్వం పేదల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. పాలకులు పేద వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని, ఎన్నికలు ముగిసిన తర్వాత వారి సమస్యలను పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదన్నారు.దళితులు, గిరిజనులు అధికంగా నివసించే గ్రామాల పట్ల కూటమి ప్రభుత్వం చిన్నచూపు ప్రదర్శిస్తోందని ఆరోపించారు. అధికారులు వెంటనే బొల్లాపల్లి మండలంలోని కండ్రిగ, గుట్టపల్లి, గంగుపల్లి గ్రామాలను సందర్శించి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించి తాగునీరు, సాగునీటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, పల్నాడు జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసా రాంబాబు, వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బుదాల శ్రీనివాసరావు, వినుకొండ పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్జీ, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ సుభాని, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణం, నాయకులు చెరుకుపల్లి నిర్మల, అప్పరాజు పవన్, మల్లికార్జున్, వందనం, రంగయ్య , సైదాతదితరులు పాల్గొన్నారు.

# ఎపి సచివాలయంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ శిబిరాన్నిప్రారంభించిన సిఇఓ

అమరావతి,జూలై 7

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై ఈనెల 6వ తేదీ నుండి 8వ తేది వరకు సచివాలయ ఉద్యోగుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాన్ని సోమవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ప్రారంభించారు. ఎపి సచివాలయం మూడవ భవనం అప్సా(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం) హాల్లో ఏర్పాటు చేసిన ఈశిబిరాన్ని ఆయన ప్రారంభించి ఉద్యోగుల ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహిస్తున్న తీరును ఆయన పరిశీలించారు.మూడు రోజుల పాటు నిర్వహించే ఈశిబిరాన్ని ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ సూచించారు.ఈ ప్రత్యేక క్యాంపులో ఎన్యుమరేషన్ ఫారాలు ఆన్లైన్ సబ్ మిషన్,కొత్త ఓటర్లు ఎన్రోల్మెంట్,ఓటర్ల జాబితా నుండి చనిపోయిన వారి పేర్లు తొలగింపు,చిరునామా మార్పు తదితర అంశాలపై ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్నారు.ఉద్యోగులు 2002 నాటి ఓటరు వివరాలు,తాజా ఫోటో,ప్రస్తుత ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు)ఆధార్ కార్డు,రెసిడెన్షియల్ అడ్రస్ ప్రూఫ్ వివరాలతో వచ్చి వారి ఓటరు వివరాలు నమోదు చేసుకుంటున్నారు.అనంతరం ఈప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో ఓటరు వివరాలు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు సిఇఓ వివేక్ యాదవ్ ఓటరు గుర్తింపు ప్రొసీడింగ్స్ ను అందజేశారు.ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కలక్టర్ సాయి కాంత్ వర్మ,గుంటూరు ఆర్డీఓ కె.శ్రీనివాసరావు,జాయింట్ సిఇఓ ఇ.వెంకటేశ్వరరావు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామకృష్ణ,సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్

## సమస్యలు విన్నవించుకున్న 64 మంది అర్జీదారులు



బాపట్ల జూలై 7

పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు.జిల్లా ఎస్పీరు అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి, వారు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించారు. తక్షణం సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి, చట్టపరిదిలో విచారించి, సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలు మరలా మరలా పునరావృతం కాకుండా శాశ్వతంగా పరిష్కరించాలని తెలిపారు. అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను పోలీస్ ప్రధాన కార్యాలయానికి పంపాలన్నారు.పోలీస్ శాఖ ఎల్లప్పుడూ బాధితులకు అండగా ఉంటుందనే భరోసాను జిల్లా ఎస్పీ అర్జీదారులకు కల్పించారు. పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను చట్ట పరిధిలో విచారించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు భూవివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, ఇతర పలు సమస్యలపై మొత్తం 64 అర్జీలను అందజేశారు.ఈ కార్యక్రమంలో సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ నాయక్, పిజిఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాపిడో బైక్‌పై తీసుకెళ్లి కిడ్నాప్..

## చాకచక్యంగా ప్రాణాలు దక్కించుకున్న మహిళ!

కరీంనగర్, జూలై 7

ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, లోన్ యాప్‌ల ఉచ్చులో పడి అప్పులపాలైన ఒక డిగ్రీ విద్యార్థి.. వాటిని తీర్చడం కోసం ఏకంగా కిడ్నాప్, దోపిడీ, హత్యాయత్నానికి ఒడిగట్టిన ఘోర ఉదంతం కరీంనగర్‌లో వెలుగుచూసింది. జగిత్యాల జిల్లాకు చెందిన ధమ్మ దినేష్ రెడ్డి అనే సెకండ్ ఇయర్ డిగ్రీ విద్యార్థి, ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్, కలర్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లలో దాదాపు రూ.4 లక్షలు నష్టపోయాడు. వీటికి తోడు పలు లోన్ యాప్‌ల ద్వారా కూడా అప్పులు చేయడంతో రుణదాతల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురైంది. ఈ క్రమంలోనే అప్పులు తీర్చేందుకు అతడు ఒక క్రిమినల్ స్కెచ్ వేశాడు.జులై 1న గంగాధర లక్ష్మి (55) అనే దినసరి కూలీ అదృశ్యమవడంతో తొలుత ఇది మిస్సింగ్ కేసుగా నమోదైంది. కానీ పోలీసుల విచారణలో ఇది ఒక భయంకరమైన కిడ్నాప్, దోపిడీ, హత్యాయత్నంగా తేలింది. నిందితుడు దినేష్ కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో వారం రోజుల పాటు రెక్కీ నిర్వహించి లక్ష్మిని టార్గెట్‌గా ఎంచుకున్నాడు. జులై 1న ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో నమ్మించి, రాపిడో బైక్ బుక్ చేసి తిమ్మాపూర్ వైపు తీసుకెళ్లాడు. ఆ తర్వాత ఆమెను తన సొంత బైక్‌పై ఎక్కించుకుని నుస్తులాపూర్ గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లోకి తీసుకెళ్లి దాడి చేశాడు. ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, 20 గ్రాముల వెండి మెట్టెలను దోచుకున్నాడు.ఆపై ఈ నేరానికి ఎలాంటి సాక్ష్యం ఉండకూడదనే ఉద్దేశంతో లక్ష్మిని అక్కడే ఉన్న ఒక వ్యవసాయ బావిలోకి తోసేశాడు. ఆమె చనిపోతుందని భావించాడు. అయితే, ఆమె బావిలోని ఒక తాడును పట్టుకోగా.. నిందితుడు ఆ తాడును కూడా బ్లేడుతో కోసేశాడు. ఆమె బతికే అవకాశం లేదని నమ్మి అక్కడి నుంచి పారిపోయాడు. కానీ, బాధితురాలికి ఈత రావడంతో ఆమె బావిలోని మోటార్ పైప్‌లైన్‌కు కట్టిన మరో తాడును పట్టుకుని రాత్రంతా ప్రాణాలతో పోరాడింది. మరుసటి రోజు ఉదయం పొలాల్లో పనిచేస్తున్న రైతులు ఆమె అరుపులు విని, తాళ్లు, మంచం సహాయంతో రక్షించి కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు.కరీంనగర్ పోలీసులు సీసీటీవీ ఫుటేజ్, మొబైల్ ఫోన్ రికార్డులు, ఇతర సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని మార్కెట్ పరిసరాల్లో అరెస్ట్ చేశారు. విచారణలో నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి నుంచి బాధితురాలి మొబైల్ ఫోన్లు, బైక్, రూ. 5,000 నగదు, వెండి మెట్టెలను స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన బంగారాన్ని ఒక జ్యువెలరీ షాపులో విక్రయించగా, పోలీసులు దానిని కూడా రికవరీ చేశారు. ఈ కేసులో త్వరలోనే చార్జ్‌షీట్ దాఖలు చేస్తామని పోలీసులు తెలిపారు.

# మేడ మీద నుంచి కిందకు తోసేసిన భార్య

నిజాబాబాద్, జూలై 7

తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. వివాహమై ఫ్యామిలీ ఉన్నప్పటికీ పరాయి వ్యక్తిపై వ్యామోహంతో ఓ ఇల్లాలు చేసిన పని అందర్నీ షాక్‌కి గురి చేసింది. ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసి, చనిపోలేదని తెలుసుకొని నరాల్లోకి హార్పిక్ ఇంజెక్ట్ చేసి కిరాతకంగా హతమార్చింది. దీన్ని గ్రహించిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ స్టైల్‌లో పోలీసులు విచారించడంతో అసలు విషయంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ శివారులో నివాసం ఉంటున్న సంధ్య, ప్రశాంత్ చాలా కాలం క్రితం వివాహమైంది. అయితే ఈ మధ్య కాలంలో వారి మధ్య తగాదాలు మొదలయ్యాయి. దీనికి సంధ్య ప్రవర్తన కారణంగా తెలుస్తోంది. ఆమె వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకున్నట్టు బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న భర్త ఆమెను నిలదీయడం మొదలు పెట్టారు. ఈ విషయంలో దంపతులు ఇద్దరూ తరచూ గొడవలు పడుతుండే వారు. ఇలా నిత్యం ఇదే విషయంలో రగడ జరుగుతోందన్న అసహనంతో సంధ్య తీవ్రమైన నిర్ణయం తీసుకుంది. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భర్తను వదిలించుకుంటే ఎలా ఉంటుందని స్కెచ్ వేసింది. దీనికి ప్రియుడు కూడా ఓకే చెప్పాడు. అయితే ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు ప్లాన్ చేశారు. దీనికి తన భర్తకు ఉన్న మద్యం అలవాటును వాడుకుంది. ఒక రోజు తన భర్తకు ఫుల్‌గా మద్యం తాగించింది. మద్యం మత్తులో ఉన్న భర్తను ప్రియుడితో కలిసి బిల్డింగ్‌పైకి తీసుకెళ్లింది. అక్కడి నుంచి తోసేసి హత్య చేయాలని అనుకుంది. ఇద్దరూ కలిసి ప్రశాంత్‌ను బిల్డింగ్ పై నుంచి తోసేశారు. అయితే అక్కడి నుంచి పడినప్పటికి గాయాలతో ఉన్న ప్రశాంత్ ప్రాణాలు ఉన్నాయి. ఇలా అయితే లాభం లేదని గ్రహించి, కొనఊపిరితో ఉన్న భర్త ప్రాణాలు తీసేందుకు మరో కిరాతకానికి ఒడిగట్టింది. బిల్డింగ్ పైనుంచి పడిపోయి గాయాలతో బాధపడుతున్న భర్తకు బాత్‌రూమ్‌లో ఉన్న హార్పిక్ ఎక్కించింది. ప్రియుడితో కలిసి సిరంజ్ సహాయంతో నరాల్లోకి హార్పిక్ ఇంజెక్ట్ చేసింది. హార్పిక్ శరీరంలోని అన్ని భాగాలకు విస్తరించింది. దీంతో ఒళ్లంతా విషపూరితమై అవయవాలు పని చేయడం మనేశాయి. దీంతో అతి దారుణంగా ప్రశాంత్ కన్నుమూశాడు. మద్యం మత్తులో బిల్డింగ్‌పై నుంచి పడి చనిపోయాడని అందర్నీ నమ్మించే ప్రయత్నం చేసింది. అయితే దీనిపై ప్రశాంతం కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చింది. చాలా కాలంగా కుటుంబంలో జరుగుతున్న పరిణామాలు తెలిసిన వారంతా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాడీని పోస్టుమార్టానికి పంపిస్తే అసలు గుట్టు వెలుగు చూసింది. దీంతో సంధ్య, ఆమె ప్రియుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. నేరాన్ని అంగీకరించడంతో వారిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచారు. పరాయి వ్యక్తి మోజులో పడి భర్త ప్రాణాలు తీస్తున్న ఘటనలు రోజు రోజుకు ఎక్కువవుతున్నాయి. దీనిపై సమాజంలో ఒక విధమైన అలజడి రేగుతోంది. కుటుంబ బంధాలపై అవగాహన లేకపోవడం, క్షణికావేశాలతోనే ఇలాంటి కేసులు పెరుగుతున్నాయని అభిప్రాయపడుతున్నారు. బంధాల కంటే సౌఖ్యాలకు, ఆర్థిక అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడమే కారణమని అంటున్నారు.

===========

# వారం రోజుల పాటు ప్రాజెక్టును కేసీఆర్ కు అప్పగించండి... నీరు అందించి చూపిస్తాం: కేటీఆర్

హైదరాబాద్, జూలై 7

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాళేశ్వరం పర్యటనలో ఉద్రిక్తత నెలకొంది. హైదరాబాద్ నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌కు వెళుతున్న కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ నేతల కాన్వాయ్‌ను పోలీసులు పలుచోట్ల అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వాగ్వాదం జరిగింది. కాళేశ్వరం వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించుకుని బీఆర్ఎస్ నేతలు పంప్‌హౌస్ వైపునకు దూసుకెళ్లారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో భయం మొదలైందని, అందుకే తమ పర్యటనను అడ్డుకుంటోందని విమర్శించారు. లక్ష క్యూసెక్కుల గోదావరి జలాలు వృథాగా సముద్రంలోకి పోతుంటే, ఎగువన ఉన్న మిడ్ మానేరు, కాళేశ్వరం సహా ఏ రిజర్వాయర్‌లోనూ నీరు లేదని అన్నారు. దీంతో రైతులు విత్తనాలు కూడా వేయలేని దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.''కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మోటార్లు ఆన్ చేస్తే తెలంగాణ మొత్తం సస్యశ్యామలం అవుతుంది. మాజీ సీఎం కేసీఆర్ ఆ విధంగా ప్రాజెక్టును డిజైన్ చేశారు. ప్రభుత్వానికి చేతకాకపోతే వారం రోజుల పాటు ప్రాజెక్టును కేసీఆర్‌కు అప్పగించండి, రైతులకు నీరందిస్తాం" అని కేటీఆర్ సవాల్ విసిరారు. రైతులకు నీళ్లిస్తే యూరియా, మద్దతు ధర, బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే భయంతోనే సీఎం కావాలనే నీటిని వృథా చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని, తమను అడ్డుకోవడం ద్వారా తన అసమర్థతను బయటపెట్టుకుంటోందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నీటిని వృథాగా సముద్రంలోకి వదులుతోందని ఆరోపిస్తూ, క్షేత్రస్థాయిలో పరిస్థితిని వివరించేందుకు కేటీఆర్ ఈ పర్యటన చేపట్టారు. సుమారు 40 కార్లతో కూడిన కాన్వాయ్‌ను వరంగల్ జిల్లా పెంబర్తి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఇంత పెద్ద కాన్వాయ్‌కు అనుమతి లేదని చెప్పగా, కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాసేపు వాగ్వాదం అనంతరం కాన్వాయ్ ముందుకు సాగింది.

నీళ్లొదలండి... ఏదైనా అయితే రాజకీయాలకు గుడ్ బై

కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ మంత్రులు చేస్తున్న దుష్ప్రచారంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఘాటుగా స్పందిస్తూ ఛాలెంజ్ చేశారు. కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్ ఆన్ చేసి ఇతర జలాశయాలకు నీళ్లు నింపండి. ఒకవేళ దీనివల్ల ప్రాజెక్టుకు ఏమైనా ప్రమాదం తలెత్తితే బాధ్యత తీసుకుని మేం రాజకీయాల నుంచి తప్పుకుంటామంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇందుకు సంబంధించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ లేఖ సైతం రాస్తారని స్పష్టం చేశారు. ఆదివారం నాడు కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ నేతల బృందం ప్రొఫెసర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కన్నెపల్లి వద్ద ఉన్న లక్ష్మీ పంప్ హౌస్‌ను పరిశీలించడం తెలిసిందేజగదీష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వంపై, ఉత్తమ్ కుమార్ రెడ్డి సహా నలుగురు మంత్రులపై విమర్శలు గుప్పించారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు మోటర్లు ఆన్ చేస్తే రోజుకు 2 ఎటిఎంల నీటిని ఎత్తిపోయొచ్చు. మేడిగడ్డతో సంబంధం లేకుండానే నీళ్లు ఇవ్వొచ్చని చూపిస్తున్నా, రేవంత్ రెడ్డి అండ్ బ్యాచ్ చంద్రబాబు స్క్రిప్ట్ ప్రకారం తెలంగాణను ఎడారిగా మార్చేందుకు నాటకాలు ఆడుతోంది. ఇకనైనా రైతుల పొట్టగొట్టే ఈ దుర్మార్గపు తీరు నశించాలని' అన్నారు. తెలంగాణలోని ఏడు జిల్లాల రైతాంగాన్ని రక్షించేందుకు తక్షణమే కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగించాలని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్ ఆదేశాల మేరకు తామంతా క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిస్థితిని సమీక్షించి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ, ప్రభుత్వ మంత్రులు బాధ్యతారాహిత్యంగా స్పందిస్తున్నారని ఆయన మండిపడ్డారు. తెలంగాణ బిడ్డలమన్న కనీస సోయి కూడా లేకుండా, మంత్రులు పాత రోత మాటలు, బూతు పురాణాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనికిమాలిన మాటలు తప్ప వారి వద్ద కొత్తదనం లేదని, ప్రాజెక్టును వినియోగించాలన్న ఆలోచన చేయకపోవడం దారుణమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై చేస్తున్న లక్ష కోట్ల అవినీతి ఆరోపణలను జగదీష్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.

# రాముడి హుండీలోని సొమ్మును లూటీ చేశారు: పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, జూలై 7

అయోధ్య రామ మందిర విరాళాల సేకరణలో కోట్ల రూపాయల భారీ అవినీతి జరిగిందంటూ తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజకీయ ఎదుగుదల కోసం దేవుడిని వాడుకోవడంలో బీజేపీ పరాకాష్ఠకు చేరిందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలు తమ స్తోమతకు తగినట్లుగా రామయ్య గుడి కోసం విరాళాలు ఇస్తే, కమలం పార్టీ నేతలు ఆ సొమ్మును కూడా వదలకుండా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు.''బీజేపీ నాయకులు శ్రీరాముడి పేరును, అక్షింతలను అడ్డం పెట్టుకుని ఇళ్ల వెంట తిరిగి విరాళాలు వసూలు చేశారు. తీరా చూస్తే ఆ నిధుల్లోనే కోట్లాది రూపాయల అవినీతికి తెరలేపారు. దేవుడి హుండీలోని సొమ్మును సైతం లూటీ చేయడం దేశ ప్రజలందరినీ అవమానించడమే" అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ నేతల అసలు రంగును, వారి అవినీతి అక్రమాలను అక్కడి స్థానిక ప్రజలు ముందే గుర్తించారని... అందుకే అయోధ్య పరిధిలోని లోక్‌సభ స్థానంలో బీజేపీ అభ్యర్థిని అక్కడి ఓటర్లు ఓడించి బుద్ధి చెప్పారని పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు.భక్తి వేరు, రాజకీయం వేరని స్పష్టం చేసిన మంత్రి... ఈ విరాళాల కుంభకోణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లదే పూర్తి బాధ్యతని అన్నారు.

# ప్రధాని షెడ్యూల్ ఖరారు కాగానే ఈ నెలలోనే విమానాశ్రయ ప్రారంభోత్సవం

## -నిర్ణీత గుడువుకు ముందుగానే విమానాశ్రయం పూర్తి: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, జూలై 7:

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు భోగాపురం విమానాశ్రయాన్ని ఈ రోజు సందర్శించారు. నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, సమీక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ విమానాశ్రయ నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో, రెండేళ్లలో నిర్ణీత సమయానికి ముందుగానే ఈ ప్రాజెక్టు పూర్తయిందన్నారు. ఇందుకోసం సహాయ, సహకారాలు అందిచిన ప్రజలు, భాగస్వాములు, అలాగే ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలను తెలిపారు.

ఈ సందర్భంగా విమానాశ్రయంలో వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించేందుకు ఎంతో కీలకమైన ఎయిరో డ్రోమ్ లైసెన్స్ ను నేడు జారీ చేసినట్లు కేంద్రమంత్రి ప్రకటించారు. ఇది సుపరిపాలనకు, రాష్ట్రాభివృద్ధి పట్ల కేంద్రానికి ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. గత నెల రోజులుగా ఎయిరో డ్రోమ్ లైసెన్స్ కోసం సంబంధించి అన్ని శాఖలు విమానాశ్రయ నిర్మాణాన్ని పలుమార్లు పరిశీలనలు, సమీక్షలు చేసి అన్ని అంశాలను పూర్తిగా ధృవీకరించుకున్న అనంతరమే నేడు ఈ లైసెన్స్ ను జారీశారు.

స్థానిక తీరంలో ప్రత్యేకంగా సంచరించే ఫ్లయింగ్ ఫిష్ ఆకృతిని నమూనాగా తీసుకుని 78,000 చదరపు అడుగు విస్తీర్ణంలో ఈ భోగాపురం విమానాశ్రయ టెర్మినల్ ను నిర్మించారు. ఉత్తరాంధ్ర స్థానిక కళలు, సంప్రదాయాలు, వారసత్వం, ప్రజల జీవన విధనాన్ని చాటేలా టెర్మినల్ ఇంటీరియర్ ను రూపొందించి, ఇది దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయంగా ఆవిర్భవించనుందని కేంద్రమంత్రి అన్నారు.

ప్రస్తుతం 30 లక్షల మంది ప్రయాణికుల సామర్థ్యం ఉన్న విశాఖపట్నం విమానాశ్రయానికి రెంట్టింపుగా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యం కలిగి ఉండేలా విమానాశ్రాయాన్ని నిర్మించారు. అలాగే భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని దశల వారీగా విస్తరించుకునేలా, 4 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యం వరకు పెంచుకునేలా ఈ భోగాపురం విమానాశ్రయ మాస్టార్ ప్లాన్ ను తయారుచేశామని కేంద్ర మంత్రి తెలిపారు.

గతంలో భేగంపేట విమానాశ్రయం ఉన్న సమయంలోనే భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శంషాబాద్ విమానాశ్రయం నిర్మాణం చేపట్టి, ప్రస్తుతం 5000 ఎకరాల్లో నిర్మాణం అయిన శంషాబాద్ విమానాశ్రయం భవిష్యత్ అవసరాలను కూడా సమృద్ధిగా అందిస్తోంది. మూడు లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని అందిస్తుంది. ఇలా అన్ని రంగాల అభివృద్ధికి అనుసంధానం అయ్యే అవకాశం విమానయాన రంగానికి ఉందని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

భోగాపురం విమానాశ్రయం చేరుకునేందుకు, రద్దీలను తగ్గించేందుకు పలు రోడ్డు మార్గాలను విస్తరించినట్లు తెలియజేశారు. విశాఖపట్నం నుంచి భోగాపురం విమానాశ్రయం సులువుగా చేరుకునేందు ఆరు వరుసల కోస్టల్ కారిడార్ నిర్మాణానికి కేంద్ర రోడ్డు, రవాణ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. అతి త్వరలోనే ఈ ప్రాజెక్టును కూడా చేపట్టనున్నారు.

లాజిస్టిక్స్ హబ్ గా మారునున్న ఉత్తాంధ్రకు ఈ భోగాపురం విమానాశ్రమం కీలకంగా మారనుంది ఆక్వా, ఫార్మా, మామిడి, ఉ ద్యానవన రంగాలకు సంబంధించిన కార్గో నిర్వహణకు ఉపయోగకరంగా ఉంటుంది. విమానాల నిర్వహణకు ముఖ్యమైన మైంటెనెన్సు, రిపేర్, అండ్ ఆపరేషన్స్ (ఎమ్ఆర్ఓ) వ్యవస్థను ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. దేశీయంగా కాకుండా విదేశాలకు చెందిన విమానాలను కూడా ఇక్కడ మర్మత్తుల చేసేలా వ్యవస్థ ఏర్పాటుకానుంది. ఎడ్యుసిటీలో రానున్న పలు జాతీయ, అంతర్జాతీయ విద్యా సంస్థలు ద్వారా ఇందుకు కావాల్సిన నైపుణ్యాలను మన యువతకు అందించి, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో భోగాపురం ప్రాంతం అంతర్జాతీయంగా ఏవియేషన్ హబ్ కానుంది.



ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలనే తీర్మానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపింది. అలాగే ఆయన విగ్రాహాన్ని ఇక్కడ ఆవిష్కరించనున్నారు.

ఈ నెలలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు ఇందు కోసం ప్రధానికి లేఖ రాసి, షెడ్యూల్ ఖరారు కోసం వెచ్చియునట్లు తెలిపారు. ప్రధాని ప్రారంభించిన వారం రోజుల్లో విశాఖపట్నం విమానాశ్రయంలోని సేవలను కూడా పూర్తి స్థాయిలో భోగాపురంలో కొనసాగించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు.

ఈ సమావేశంలో విలేకరులు, యు.డి.ఎఫ్ చార్జీల విషయాలతో పాటు పల అంశాల పై అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, నెలిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి, మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు. జిల్లా అధికారులు, జి.ఎం.ఆర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## బింగి నరహరి మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు: సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ

భారత శక్తి, జూలై 07 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి):

యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లి సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి బింగి నరహరి మృతి చెందడం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ అన్నారు. మంగళవారం అనారోగ్యంతో మృతి చెందిన బింగి నరహరి మృతదేహాన్ని సందర్శించి ఆయన భౌతిక గాయానికి సిపిఐ నాయకులు అరుణ పతాకాన్ని కప్పి పూలమాల వేసి నివాళు లర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించినటువంటి నరహరి కమ్యూనిస్ట పార్టీలో చేరి అంచలంచలుగా గ్రామ శాఖ కార్యదర్శిగా ఎదిగి పేద ప్రజల సమస్యలు, చేనేత కార్మికుల సమస్యలు, ఆటో కార్మికుల సమస్యలపై పోరాటాలు చేసి వాటి పరిష్కారం కొరకు పనిచేసిన నాయకుడని కొనియాడారు. వారి మృతి కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అని వారి కుటుంబానికి కూడా తీరని నష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన మహేందర్, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపెల్లి మహేందర్, యాదగిరిగుట్ట పట్టణ కార్యదర్శి కౌన్సిలర్ బబ్బురి శ్రీధర్, సిపిఐ సీనియర్ నాయకులు బండపల్లి నరసయ్య, బుల్లె రాములు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## పద్మ శ్రీ డాక్టర్ మంద కృష్ణ మాదిగ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన క్రైస్తవ సంఘాల నాయకులు బిషప్ దుర్గం ప్రభాకర్, ఇరుగు సామ్సన్

సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జూలై 7: హైదరాబాద్ నందు డా.పద్మ శ్రీ మంద కృష్ణ మాదిగ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ దళిత క్రైస్తవ రాష్ట్ర నాయకులు.ఈ సందర్భంగా బిషప్ దుర్గం ప్రభాకర్ మాట్లాడుతూ జూలై 7, 1965న యల్లయ్యగా జన్మించిన మంద కృష్ణ మాదిగ , అణగారిన మాదిగ సమాజం యొక్క హక్కుల కోసం పోరాడిన కార్యకర్త అతను 1980లలో కుల వ్యతిరేక కార్యకర్తగా ఉండి, 1994లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని స్థాపించ్ఙీ అతని కార్యకలాపాలలో కుల వివక్ష, పిల్లల ఆరోగ్యం మరియు ఉచిత గుండె ఆపరేషన్,వికలాంగుల హక్కుల పోరాటం కొరకు ఉద్యమం చేసి.



కరంచేడు (1985) మరియు చుండూరు (1991) మారణకాండల తర్వాత బలం పుంజుకున్న విస్తృత పోరాటం చేసిన గొప్ప నాయకులు.ఇటీవల ఆంధ్ర ప్రదేశ్ లో చింతాడ ఆనంద్ విషయం లో దళిత క్రైస్తవులకు రిజర్వేషన్ ఎత్తివేయడం పై దేశవ్యాప్తంగా దళితులకు జరుగుచున్న అన్యాయం పై ప్రస్తుతం దళిత క్రైస్తవ ఉద్యమంనకు ఊపిరి పోసిన డా.పద్మ శ్రీ.మంద కృష్ణ మాదిగ అనీ అన్నారు.ఈ కార్యక్రమం లో తెలంగాణ క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఇరుగు సంసోన్, సూర్యాపేట నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిఫ్ అధ్యక్షులు రెవ. డా. జలగం జేమ్స్, బ్రదర్ జాటోత్ డేవిడ్ రాజు పాల్గొన్నారు.

## అదుపుతప్పి కెనాల్‌లో పడిన ట్రాక్టర్ డ్రైవర్ మృతి

జగిత్యాల, జులై 7 (భారత శక్తి ప్రతినిధి):

ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామానికి చెందిన గౌరీ గంగయ్య (42) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారీ పనుల్లో భాగంగా సోమవారం యజమానికి చెందిన ట్రాక్టర్‌తో నేరెళ్ల కెనాల్ సమీపంలోని పొలాలకు వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా నేరెళ్ల కెనాల్ వద్ద మలుపు దగ్గర ట్రాక్టర్ అదుపుతప్పి కెనాల్‌లో పడిపోయింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ గంగయ్యపై పడటంతో అతనికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య గౌరీ సుమలత ఫిర్యాదు మేరకు ధర్మపురి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి. మహేష్ తెలిపారు.

## కన్నెపల్లి పంపు హౌస్‌లను వెంటనే ప్రారంభించాలి బీఆర్ఎస్

జగిత్యాల, జులై 7 (భారత శక్తి ప్రతినిధి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగమైన కన్నెపల్లి పంపు హౌస్‌లను వెంటనే పునఃప్రారంభించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు మంగళవారం ధర్మపురిలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, పంపు హౌస్‌లు నిలిపివేయడంతో రైతులు సాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. వానాకాలం సాగు ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం తక్షణమే కన్నెపల్లి పంపు హౌస్‌లను ప్రారంభించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి సరఫరా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కన్నెపల్లి పంపు హౌస్‌ల ద్వారా నీటి సరఫరా పునఃప్రారంభించే వరకు బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సంగి సత్తెమ్మ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అయ్యోరి రాజేష్ కుమార్, పట్టణ కన్వీనర్ బండారి రంజిత్, నాయకులు సంగి శేఖర్, పెరుమాండ్ల ఎల్లగౌడ్, బండారి అశోక్, చుక్క రవి, తరాల కార్తీక్, గుర్రాల సుధాకర్, అనంతుల లక్ష్మణ్, ఎండీ షమీమా, కుక్కల గంగారెడ్డి, మోలుగూరి రాజన్న, స్తంభంకాడి మహేష్, మామిడి శ్రీనివాస్, కాశెట్టి విజయ్, కళ్లెం రిషిరెడ్డి, మూటపెల్లి లడ్డు, మోలుగూరి ప్రశాంత్ పాల్గొన్నారు.

## వివేకానంద సేవా ట్రస్ట్‌కు TGNPDCL నుంచి నెలకు 20 వేల ఆర్థిక సహాయం.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 07 (భారత శక్తి )భైంసా,సమాజ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు భైంసా పట్టణంలోని వివేకానంద సేవా ట్రస్ట్‌కు TGNPDCL ట్రస్ట్ డివిజన్, వరంగల్ ప్రతి నెల రూ.20,000 ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. ట్రస్ట్ అభివృద్ధి కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల నిర్వహణ కోసం ఈ సహాయాన్ని అందిస్తున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు.

ఈ ఆర్థిక సహాయం TGNPDCL జవీణ వరుణ్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్) జె. చవాన్, సూపరింటెండింగ్ ఇంజనీర్ సుభాష్, డివిజనల్ ఇంజనీర్ తిలక్, అసిస్టెంట్ ఇంజనీర్ మోహన్ కుమార్ గారి మార్గదర్శకత్వం, సూచనల మేరకు అందుతున్నట్లు



పేర్కొన్నారు.

ఈ సందర్భంగా వివేకానంద సేవా ట్రస్ట్ ప్రతినిధులు, ట్రస్ట్ అభివృద్ధికి మరియు సమాజ సేవా కార్యక్రమాలకు నిరంతర సహకారం అందిస్తున్న TGNPDCL యాజమాన్యానికి, సంబంధిత అధికారులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సహకారంతో పేదలు, నిరుపేదలు, అవసరమైన వారికి మరింత విస్తృతంగా సేవలు అందించే అవకాశం లభిస్తుందని వారు పేర్కొన్నారు.

## ఎన్‌డీఆర్‌ఎఫ్ కమ్యూనిటీ అవగాహన కార్యక్రమంపై సమీక్షా సమావేశం: భైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జులై 07 (భారత శక్తి )భైంసా, జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించనున్న కమ్యూనిటీ అవగాహన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సోమవారం భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.



ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్‌తో పాటు ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజల్లో ప్రకృతి విపత్తులు, ఇతర అత్యవసర పరిస్థితుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం, విపత్తుల సమయంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలు, కార్యక్రమ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు.

ప్రజల్లో విపత్తుల పట్ల అవగాహన పెంపొందించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించే లక్ష్యంతో కమ్యూనిటీ అవగాహన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సమావేశంలో అధికారులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

## చిన్నారుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలి. -బాలల సదనంను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే పాయం

మణుగూరు, జూలై 07 (భారతశక్తి): బాలల సదనంలో ఉన్న బాలబాలికల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులకు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలో గల బాలల సదనం (చిల్డ్రన్ హోమ్) ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందుతున్న వసతి, ఆహారం, విద్య, వైద్య సదుపాయాలు, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం చిన్నారులతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. బాలల సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ సేవలు ప్రతి చిన్నారికి సక్రమంగా అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. చిన్నారుల భవిష్యత్తు బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లేనినా, ఐసిడిఎస్ మణుగూరు ప్రాజెక్టు అధికారి జయలక్ష్మి, బాలల సదనం సూపరింటెండెంట్ శిరీష, సిడబ్ల్యూఓ దీప్తి, సిబ్బది మంజుల, కుమారి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, పట్టణ అధ్యక్షులు రవి కుమార్, జిల్లా నాయకులు, మండల నాయకులు, మైనారిటీ అధ్యక్షులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల



ఖమ్మం బ్యూరో, భారత శక్తి, జూలై 07: ఖమ్మం నగరం 58 డివిజన్ బి సి కాలనీ నందు జరిగిన కోటి రూపాయల నిధుల మంజూరులో భాగంగా వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక నాయకులు శెట్టి రంగారావు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రివర్యులు తుమ్మల మాట్లాడుతూ...... ఖమ్మం నగరంలో డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు శాయశక్తుల కృషి చేస్తానని దానిలో భాగంగానే ఈ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, గిడ్డంగుల చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య,మాజీ కార్పొరేటర్ రాపర్తి శరత్, డిపార్ట్మెంట్ ఇ ఇ కృష్ణలాల్, డి ఇ శ్రీనివాసరావు, ఏ ఇ తేజ, కొండలరావు ,స్థానిక నాయకులు నాంపల్లి శంకరయ్య, పాలడుగు నాగేశ్వరావు, పోటు కళావతి, ఆకుతోట ఉపేందర్, రామాచారీ, పోట్ల నాగేశ్వరావు, ఏటుకూరి కోటేశ్వరరావు, ఈదుప్గంటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురి లో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



జగిత్యాల, జులై 7 (భారత శక్తి ప్రతినిధి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావానికి 32 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ధర్మపురి పట్టణంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి, వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ వేముల నాగలక్ష్మి హాజరై మాట్లాడుతూ, మందకృష్ణ మాదిగ సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమని అన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్, కాంగ్రెస్ నాయకుడు చిలుముల లక్ష్మణ్‌తో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం ఆయన చేసిన కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చెందోలి శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు పులి ప్రేమిత్, అంబేద్కర్ మండల అధ్యక్షుడు సతీష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బండారి రంజిత్, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి మరణం బాధాకరం: ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

భారత శక్తి, జూలై 07 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి):



మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ తొలి దశ ఉద్యమకారుడు కొమ్మిడి నర్సింహారెడ్డి మరణం బాధాకరమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజా సేవనే జీవిత ధ్యేయంగా మలచుకున్న నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని కొనియాడారు. నిరాడంబరత, నిబద్ధత, ప్రజల పట్ల అంకితభావంతో సాగిన ఆయన ప్రజా జీవితం ఎందరికో ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కొమ్మిడి నర్సింహారెడ్డి మరణం తెలంగాణకు, ప్రజా జీవితానికి తీరని లోటని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

# చిన్నారుల ఆరోగ్యమే భవిష్యత్‌కు బలమైన పునాది -అంగన్వాడీ కేంద్రాల్లో 'తొలి ముద్ద' పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం



మణుగూరు, జూలై 07 (భారతశక్తి): చిన్నారుల ఆరోగ్యమే భవిష్యత్తుకు బలమైన పునాదులు వేసుకుంటారని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం ఐసిడిఎస్ మణుగూరు ప్రాజెక్టు పరిధిలోని మున్సిపాలిటీ ఏరియాలో గల శివలింగాపురం, ఎస్సి కాలనీ-1, 2 అంగన్వాడీ కేంద్రాల్లో జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లేనినా, మణుగూరు సిడిపిఓ జయలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'తొలిముద్ద' పథకాన్ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తొలిముద్ద పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు ఉదయం పూట పౌష్టికాహారమైన ఉప్మా, కిచిడీ వంటి అల్పాహారాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా డిడబ్ల్యూఓ స్వర్ణలత లేనినా, సిడిపిఓ జయలక్ష్మి, ఎమ్మెల్యే పాయం చిన్నారులకు ఉప్మా, కిచిడీ తినిపించి వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. అనంతరం వారితోపాటు సహపంక్తి బ్రేక్ ఫాస్ట్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణీలకు, చిన్నారులకు అందుతున్న సేవలు, పోషకాహార పంపిణీ, సంక్షేమ కార్యక్రమాల అమలుపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్నారుల జీవితంలో తొలి ఐదేళ్లు అత్యంత కీలకమైనవని, ఈ దశలో సరైన పోషకాహారం అందితేనే వారి శారీరక, మానసిక వికాసం మెరుగ్గా ఉంటుందని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పోషకాహారం, ఆరోగ్య సేవలు ప్రతి కుటుంబానికి చేరేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. చిన్నారుల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం ద్వారా బలమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఐసిడిఎస్ మణుగూరు ప్రాజెక్టు సూపర్వైజర్లు, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు సుమలత, నక్క రాణి, సుజాత, మండల కాంగ్రెస్ అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు కుర్రం రవి కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మైనారిటీ అధ్యక్షులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయ సహకారాలతో.. ముందుకెలదాం! సమాచార పౌర సంబంధాల శాఖ జోన్ -4 నూతన ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్



కడప, జూలై 7(భారత శక్తి ) : రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారుల సమన్వయ సహకారాలు, సమాచారశాఖ, మీడియా సమిష్టి కృషితో ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి ఫలాలను ప్రజలకు చేరవేసేందుకు పాటుపడదాం అని ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్ కోరారు.

మంగళవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ లోని సమాచార పౌర సంబంధాల శాఖ ఆర్జేడీ కార్యాలయంలో జిల్లాలోని మీడియా స్టాఫర్లు, సిబ్బందితో ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్ ఆత్మీయ పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ ఆర్ కడప జిల్లాలో జోన్-4 కార్యాలయంలో ఆర్జెడీగా విధులు నిర్వర్తించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. జోన్-4 పరిధిలోని జిల్లాల్లో సమాచార శాఖ, మీడియా పబ్లికేషన్స్, ప్రసారాల ద్వారా విస్తృతమైన సేవలు అందాల్సిన అవసరం ఉందన్నారు.

ముఖ్యంగా ఈ జిల్లాల్లో అక్షరాస్యత, పేదరిక నిర్మూలన, వ్యవసాయం, ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ రకాల కార్యక్రమాలను, సంక్షేమ అభివృద్ధి ఫలాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో మీడియా పాత్ర చాలా కీలకమైనదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజలు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల సమన్వయ సహకారంతో మీడియా ప్రతినిధులు కర్తవ్య నిబద్ధతతో, పారదర్శకంగా వృత్తి ధర్మాన్ని నెరవేర్చాలన్నారు.

సమాచార శాఖను పటిష్టం చేయడంతో పాటు.. జోన్-4 పరిధిలోని జిల్లాల్లో పాత్రికేయులకు వృత్తి పరంగా సహాయసహకారాలు అందించడంలో ఎల్లపుడు ముందుంటామన్నారు. సమాచార శాఖ, పాత్రికేయుల మధ్య సత్సంబంధాలు కొనసాగినప్పుడే ప్రభుత్వ ఫలాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందగలవని, అందుకోసం అందరం సమిష్టిగా కృషి చేయాలని మీడియా ప్రతినిధులకు పిలుపునిచ్చారు.

అనంతరం పలువురు పాత్రికేయులు, సిబ్బంది ఆర్జెడీ కి పుష్ప గుచ్చాలు అందజేసి దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు, సమాచార శాఖ ఎడి కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జూలై 8 నుంచి పీఎం విశ్వకర్మ రుణ అవుట్‌రీచ్ శిబిరాలు..!

కడప, జూలై 7(భారత శక్తి ): వైఎస్ఆర్ కడప జిల్లాలో ప్రధాన్ మంత్రి విశ్వకర్మ పథకం కింద గతంలో తిరస్కరణకు గురైన రుణ దరఖాస్తులను పునఃపరిశీలించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు జూలై 8 నుంచి 18 వరకు ప్రత్యేక రుణ అవుట్‌రీచ్ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) జి. జనార్ధనం తెలిపారు.

భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎంఎస్ఎంఈ అభివృద్ధి మరియు సౌకర్యాల కార్యాలయం, విశాఖపట్నం ఆధ్వర్యంలో జిల్లా లీడ్ బ్యాంక్ కార్యాలయం సహకారంతో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంప్రదాయ వృత్తిదారులు, కళాకారులకు సకాలంలో బ్యాంకు రుణాలు అందించి స్వయం ఉపాధిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరాలు నిర్వహించబడతాయని తెలిపారు. జూలై 8న బద్వేలు ఎంపీడీవో కార్యాలయంలో, 9న సిద్దవటం ఎంపీడీవో కార్యాలయంలో, 10న పులివెందుల ఎంపీడీవో కార్యాలయంలో, 14న జమ్మలమడుగు ఎంపీడీవో కార్యాలయంలో, 16న ప్రొద్దుటూరు ఎంపీడీవో కార్యాలయంలో, 18న కడప జిల్లా పరిశ్రమల కేంద్రంలో శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

శిబిరాలకు హాజరయ్యే పీఎం విశ్వకర్మ లబ్ధిదారులు ఆధార్ కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ ఫోన్, పాన్ కార్డు (ఉన్నవారు), పీఎం విశ్వకర్మ ప్రాథమిక శిక్షణ పూర్తి చేసిన ధ్రువీకరణ పత్రం, దరఖాస్తులో పేర్కొన్న బ్యాంకు ఖాతా పాస్‌బుక్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు.

వైఎస్ఆర్ కడప జిల్లాలోని అర్హులైన సంప్రదాయ వృత్తిదారులు, కళాకారులు తమకు సమీపంలోని శిబిరానికి నిర్ణీత తేదీన హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎల్డిఎం విజ్ఞప్తి చేశారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి.



జనగామ(భారత శక్తి)జులై 7:

జఫర్ గడ్ మండలం తిమ్మంపేట గ్రామ సర్పంచ్ చాడ కవిత రాజేందర్ రెడ్డి మామ చాడ రాజగోపాల్ రెడ్డి మరణించగా వారి కుటుంబ సభ్యులను మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం లక్ష్మి నాయక్ తండా పరిధిలోని లింబా తండాకు చెందిన మాజీ సర్పంచ్ గుగులోత్ దీప్ల నాయక్ మరణించగా ఆయన పార్థివా దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఉప్పుగల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లేంకెల రాజు తండ్రి లేంకెల మల్లయ్య మరణించగా ఆయన పార్థివా దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన మామిండ్ల రాజు మరణించగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి ఆర్థిక సహాయం అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల ఐలయ్య, పిఏసీఎస్ చైర్మన్ తీగల కరుణాకర్ రావు, ఆయా గ్రామాల సర్పంచ్లు, మండల మరియు స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బూత్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి బిఎల్ఏలు కీలక పాత్రపోషించాలి దావెర అనీ ల్ కుమార్

జనగామ(భారత శక్తి)జులై 7:



దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బీఎల్ఏల (దీశీశ్రేష్ఠ నావజవశ్రీ ఘాస్త్రవత్ం) అవగాహన సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దావెర అనిల్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం సాధించాలంటే బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం కావడం ఎంతో ముఖ్యమని,ప్రతి బీఎల్ఏ తన బూత్‌లో ఓటరు జాబితాను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడికి ఓటు నమోదు చేయించాలని,ఓటర్ల వివరాల్లో ఉన్న తప్పులను సరిచేయించడంతో పాటు,ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా చనిపోయిన,శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్ల తొలగింపు ప్రక్రియలో సహకరించాలని,బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి బీఎల్ఏలు కీలక పాత్ర పోషిస్తారని,ప్రతి బూత్‌ను కాంగ్రెస్ పార్టీకి బలమైన కోటగా తీర్చిదిద్దేందుకు నాయకులు,కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని,ఎన్నికల సంఘం చేపట్టే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో పేరు ఉండేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం బీఎల్ఏలకు ఓటరు నమోదు, సవరణ, తొలగింపు దరఖాస్తుల ప్రక్రియ, బూత్ స్థాయి బాధ్యతలు, బీఎల్‌వోలతో సమన్వయం వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ సెల్ అధ్యక్షులు ఇనుముల నాగరాజు,భూక్యా సజ్జన్,కాడబోయిన గణేష్,మహ్మద్ గులాం రసూల్,జిల్లా నాయకులు ధర్మారెడ్డి,తోటకూరి పాండు కృష్ణ,భాస్కర్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిగిల్ల వెంకన్న,నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు ఉప్పుల ప్రకాష్,మండల నాయకులు బోనగిరి యకస్వామి,రెడ్డి రాజుల రమేష్,పారుపల్లి శ్రీనివాస్, తోటకూరి రమేష్,వివిధ గ్రామాల సర్పంచులు,వార్డు సభ్యులు,గ్రామ శాఖ అధ్యక్షులు,బీఎల్ఏలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్డిఎఫ్ నిధుల మంజూరు పత్రాలను ఆయా గ్రామాల సర్పంచులకు అందజేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి.



జనగామ(భారత శక్తి)జులై 7: హన్మకొండ కనకదుర్గ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ధర్మసాగర్ మండలంలోని సాయిపేట, క్యాతంపల్లి, తాటికాయల, నర్సింగారావుపల్లి, ఎల్కుర్తి, కరుణాపురం గ్రామాలలో అభివృద్ధి పనులకు మంజూరు అయిన ఎస్డిఎఫ్ నిధుల మంజూరు పత్రాలను ఆయా గ్రామ సర్పంచులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి అందజేశారు.

సాయిపేట గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సిసి డ్రైన్ ల నిర్మాణానికి 20లక్షలు, తాటికాయల గ్రామంలో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ ప్రహరీ గోడ నిర్మాణానికి 5లక్షలు, ఎల్కుర్తి గ్రామం ఏమ్మన్నగూడెంలో ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి 10లక్షలు, క్యాతంపల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవనానికి మరియు త్రాగు నీటి సమస్య పరిష్కానికి 6లక్షల 75వేలు, కరుణాపురం గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి 4లక్షల 50వేలు, నర్సింగరావుపల్లి గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం మరియు ప్రాథమిక పాఠశాలలో మారమ్మత్తులకు 15 లక్షలు మొత్తం 61లక్షల 24వేల రూపాయల విలువగల అభివృద్ధి పనులకు మంజూరు పత్రాలను ఆయా గ్రామాల సర్పంచులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో ఏదో ఒక అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు జాతుగుతున్నాయని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతోనే పని చేస్తున్నానని తెలిపారు. సర్పంచులు గ్రామాలలో పని చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గ్రామ అభివృద్ధితో పాటు ప్రజలకు అవినీతి రహితమైన పాలన అందించాలని సూచించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులలో గాని, సంక్షేమ పథకాల అమలులో గాని అవినీతికి ఆస్కారం ఉండదని స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధికి నిధులు సమకూర్చే బాధ్యత నాదని నిజాయితీగా పని చేసే బాధ్యత సర్పంచులదని వెల్లడించారు. అందరం కలిసి నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ మండల పార్టీ అధ్యక్షుడు పెసరు రమేష్, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దు రౌడీషీటర్లను హెచ్చరించిన గుట్ట ఇన్‌స్పెక్టర్ భాస్కర్

భారత శక్తి, జూలై 07 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి):



సమాజంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని యాదగిరిగుట్ట పట్టణ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్, యాదాద్రి డివిజన్ డిఎస్పి శ్రీనివాస్ నాయుడుల ఆదేశాల మేరకు మంగళవారం మధ్యాహ్నం యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ నేరాలు చేసి కేసులు నమోదు అయినటువంటి రౌడీషీటర్లు అందరినీ హాజరు పరిచి ప్రతి ఒక్కరిని తనిఖీ చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ తాము చేసుకునే పని సక్రమంగా నిర్వర్తించుకోవాలని ఎటువంటి నేరపూరితమైన దందాలకు మరియు నేరాలకు పాల్పడొద్దని, లా అండ్ ఆర్డర్ మరియు శాంతి భద్రతలకు ఎలాంటి అగాథం కలిగించవద్దని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. ఇక నుండి ప్రతి నెల రెండుసార్లు రౌడీ షీటర్లు అందరినీ హాజరు పరిచి తనిఖీ చేయడం జరుగుతుందని, హాజరు కాని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు యాదయ్య, సైదులు, కృష్ణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

# వరద వెల్లిలో ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావిని పూడ్చివేయాలి.

## రైతుకు నష్టపరిహారం చెల్లించాలి: సీపీఎం నేత

## రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూలై 07:




బోయిన్‌పల్లి మండలం వరదవెల్లి శివారులోని పెద్దమ్మ గుడి నుంచి రాజన్నపేట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన, ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావిని వెంటనే పూడ్చివేయాలని సీపీఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా ఈ బావి రహదారికి మరీ అనుకుని ఉండటంతో ప్రయాణికులకు తీవ్ర ముప్పు పొంచి ఉందన్నారు. రోడ్డు విస్తరణ కారణంగా నష్టపోతున్న సదరు వ్యవసాయ బావి యజమానికి (రైతుకు) ప్రభుత్వం వెంటనే తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా, ఈ రహదారి నిర్మాణాన్ని చేపడుతున్న కాంట్రాక్టర్లు ఎక్కడా నాణ్యతా లోపాలు లేకుండా, సరైన ప్రమాణాలు పాటించి పనులు పూర్తి చేయాలని పత్రికా ముఖంగా డిమాండ్ చేశారు.

# మాదిగ పల్లెల్లో రెపరేపలాడిన ఎమ్మార్పీఎస్ జెండా.!



మణుగూరు, జూలై 07 (భారతశక్తి) : మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 32 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాదిగ, మాదిగ ఉపకులాల పల్లెల్లో ఎమ్మార్పీఎస్ జెండా రెపరేపలాడిది. సామాజిక న్యాయం, వర్గీకరణే లక్ష్యంగా దశబ్దాలుగా ఉద్యమాలు చేసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మాన్యశ్రీ మంద కృష్ణ మాదిగ 60 వసంతాలు పూర్తి చేసుకొని 61 సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా మాదిగ, మాదిగ ఉపకులాల నేతలు పల్లెల్లో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు మంగళవారం మణుగూరు మండలంలోని మాదిగ గ్రామాల్లో జెండా పండుగతో పాటు పద్మశ్రీ గ్రహీత మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఉత్సాహక బరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా సహాయ కార్యదర్శి కొమ్ము హుస్సేన్ మాట్లాడుతూ 1994 జూలై 7న ప్రకాశం జిల్లా, ఈరుముడి గ్రామంలో 20 మందితో మాదిగ దండోర ఉద్యమం ఏర్పడిందన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించడమే కాకుండా అనేక ఉద్యమాలలో పురోగతిని సాధించి జాతీయ స్థాయికి ఎదిగి 32వ వసంతంలోకి అడుగు పెట్టిందన్నారు. వెనుకబడిన తరగతుల(బీసీలు) రిజర్వేషన్ల ఏవిధంగా ఏబీసీడీలుగా వర్గీకరించబడి ఉన్నాయో, ఎస్సీ రిజర్వేషన్లు కూడా అదేవిధంగా వర్గీకరించి.. అన్నికులాలకు న్యాయం చేయాలని కోరుతన్న మాదిగలకు.. అన్ని రాజకీయ పార్టీలు మద్దతుగా నిలిచి వర్గీకరణ సాధనకు కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితిసింగారం ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, మండల అధ్యక్షులు పొడుతూరి కళ్యాణ్ బాబు మాదిగ, బొమ్మల వెంకటేశ్వర్లు మాదిగ, మంద కోటి మాదిగ, అర్ర కనకయ్య మాదిగ, తేలూరి నాగయ్య మాదిగ, మంద కృష్ణ మాదిగ, నాగరాజు మాదిగ, కృష్ణ, మల్లేశ్వరి, ఇంద్ర, కమలమ్మ, శ్రీలక్ష్మి, మౌనిక, శ్రీహర్ష తదితరులు పాల్గొన్నారు.

# రేగొండ చేనేత సహకార సంఘం ఎన్నిక ఏకగ్రీవం.

## చైర్మన్ గా పన్నాటి శ్రీనివాస్, వైస్ చైర్మన్ రాచర్ల రాజేందర్



రేగొండ, జూలై 07 (భారత శక్తి): రేగొండ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు గా పన్నాటి శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు . రూపిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన చేనేత సంఘం కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆయన పేరు ప్రతిపాదించి ఆమోదించారు. దీంతో ఎన్నికల అధికారి రిలీఫ్ రెడ్డి,అధ్యక్ష పదవికి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. అలాగే ఉపాధ్యక్షులు రాచర్ల రాజేందర్,కార్యదర్శిగా కూచన రాజ్ కుమార్,కోశాధికారి కొండా స్వామి ,డైరెక్టర్లు పన్నాటి మార్కండేయ ,మంతెన రవీందర్, ఆడెపు బాబు,పన్నాటి రమ,కూచన అరుణ, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు . ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘం సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. చేనేత సంఘం కార్మికుల సంక్షేమం అభ్యున్నతి కోసం అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తో పాటు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హత కలిగిన చేనేత కార్మికుడికి అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్మికుల ఆర్థికాభివృద్ధి కి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతామని చెప్పారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసి చేనేత కార్మికుల హక్కుల పరిరక్షణకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని స్పష్ట చేశారు. అనంతరం సంఘం సభ్యులు చేనేత కార్మికులు గ్రామ పెద్దలు శ్రీనివాస్ ను ఘనంగా సన్మానించి పూల మాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.

# హాస్టల్ విద్యార్థులకు బస్ సౌకర్యం కల్పించాలి

## ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో డిపో మేనేజర్ కు వినతిపత్రం అందజేత

భారత శక్తి, జూలై 07 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి):




యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రభుత్వ హాస్టల్ నుండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని కోరుతూ అఖిల భారత యువజన సమాఖ్య మండల కమిటీ ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట డిపో మేనేజర్ కు వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ యాదగిరిగుట్ట ప్రభుత్వ హాస్టల్ లో సుమారు 80 మంది విద్యార్థులు బస్ సౌకర్యం లేక సుదూర ప్రాంతం ప్రభుత్వ పాఠశాల వరకు కాలి నడకన ఇబ్బందులు పడుతూ వెళ్తున్నారని, గత సంవత్సరం విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినప్పటికీ ఈ సంవత్సరం విద్యా సంవత్సరం ప్రారంభమై చాలా రోజులు గడుస్తున్నా ఇప్పటికీ బస్సు సౌకర్యం కల్పించకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడవలసి వస్తుందన్నారు. కాబట్టి అధికారులు వెంటనే హాస్టల్ నుండి ప్రభుత్వ పాఠశాల వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కంబాల వెంకటేష్, ఏఐవైఎఫ్ నాయకులు అనంతుల నరసింహ, పాకలపాటి రాజు, కంబాల నరసింహ, తాడూరి వెంకటేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మొహమ్మద్‌నగర్, నిజాంసాగర్ మండలాల్లో ఎస్ఐఆర్ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ విక్టర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జులై 07: ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్ మంగళవారం మహమ్మద్‌నగర్, నిజాంసాగర్ మండలాల్లో పర్యటించి ఎస్ఐఆర్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

మొదట మహమ్మద్‌నగర్ మండలంలోని హసన్‌పల్లి గ్రామం, పోలింగ్ స్టేషన్ నెం. 251ను సందర్శించి బూత్ లెవల్ అధికారి (బిఎల్ఓ), సూపర్వైజర్, తహసీల్దార్‌తో కలిసి ఇంటింటి ఎన్యుమరేషన్, ఓటరు వివరాల ధృవీకరణ, దరఖాస్తుల స్వీకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను పరిశీలించారు.

అనంతరం నిజాంసాగర్ మండలంలోని సుల్తాన్‌నగర్, బంజేపల్లి గ్రామాల పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ కొనసాగుతున్న ఎస్ఐఆర్ పనులను సమీక్షించారు. బీఎల్‌వోలు, సూపర్వైజర్లు, తహసీల్దార్‌తో మాట్లాడి ఇంటింటి సర్వే, ఫారాల స్వీకరణ, ఓటరు వివరాల నమోదు, డిజిటైజేషన్ పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈ పర్యటనలో సంబంధిత తహసీల్దార్లు, బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓ లు), సూపర్వైజర్లు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published & Printed at Sri Muktheswara Publications, D.No. 4-2-252, Subhash Nagar, Hanmakonda, Warangal – 506001, Telangana. Fax: 040-24054446 ,Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, APTEL/2013/50560,Editor: Kesaram Penta Reddy